## పుస్తక పరిచయం

జీవి భగవంతుడి వైపు చేసే ప్రయాణంలో ఎదురయ్యే ప్రతీ విషయాన్నీ తనదైన సొంత పరిజ్ఞానంతో అర్థం చేసుకుంటుంది. జీవి పరిధిలో మాత్రమే గ్రహించబడినది "నిజం" అయి వుండక పోవటం వల్ల అది జీవికి నిజ ప్రయోజనాన్ని ఇవ్వటం లేదు. జీవికి ప్రతి విషయపు వెనకాల వున్న భగవత్ ఉద్దేశాన్ని భగవత్ చిత్తాన్ని తెలియచేస్తూ తద్వారా జీవిని "నిజం"లోకి నడిపించటానికి చేసిన ప్రయత్నమే ఈ పుస్తకము.

2009 వసంIIలో (జులై 2 నుండీ 9 వరకు) జరుగబడిన ఆదిగురు బ్రహ్మోత్సవాల సందర్భంగా గిరిధర్ వాణి తమ ఆశ్రితులచే ఈ " నిజ" ప్రసాదాన్ని అనుభవింప చేసారు.

**-గిరిధర్‌వాణి ఆనందనందనం.**



# నిజం

**- భగవంతుని చిత్తం**

ఒకరి చిత్తము ఏమైవున్నదో స్వయంగా వారు చెప్తేనే మనకు పూర్తి స్థాయిలో అవగాహన అవుతుంది. అదే మనంతట మనము తెలుసుకోవాలని ప్రయత్నిస్తే మన పరిధి మేరకే అవగాహన అవుతుంది. మరీ ముఖ్యంగా మనము భగవంతుడిని వారి తత్వాన్ని అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నప్పుడు మన సొంత శక్తి సరిపోదు. ఆ భగవంతుడే స్వయంగా "నా చిత్తము ఇదై వున్నది" అని చెప్పినప్పుడే మనము నిజాన్ని తెలుసుకోగలము. ఇక్కడ చిత్తము అంటే భగవంతుడి హృదయం. భగవంతుడి ఇష్టము, భగవంతుడి ఉద్దేశ్యము. ఇష్టాయిష్టాలు అంటే సాధారణ వ్యక్తికి వుండే ప్రకోపాలు లాంటివి కావు, ప్రతీ విషయం వెనుక వున్న భగవత్ ఉద్దేశాన్ని వారి ఇష్టము అంటున్నాము.

ప్రతి చర్య వెనుక దాగివున్న భగవత్ ఉద్దేశాన్ని భగవంతుని చిత్తము అంటున్నాము. "ఇష్టము" అనగానే సహజంగా వుండే ప్రకోపముగా జీవి అర్థం చేసుకుంటుందని ఇష్టానికి చిత్తము అనే పర్యాయ పదాన్ని వాడుతున్నాం.ఒక వ్యక్తి ఇష్టమే మనము పూర్తిగా తెలుసుకోలేం కదా మరి భగవత్ ఉద్దేశాన్ని ఎలా తెలుసుకోగలం? తెలియబడినది. నిజమే అని ఎలా నిర్ధారించగలం? అంటే దానికి సమాధానం :

సర్వవ్యాపకమైన భగవంతుని పట్ల నిరంతరం ఎడతెగని శ్రద్ధని (Un-divided attention) మనము కలిగి వున్నప్పుడు ఆ భగవంతుడే స్వయంగా

మనకు వారి చిత్తాన్ని ప్రబోధిస్తారు. వారే తేట తెల్లంగా మనకు అవగాహనని కల్పిస్తారు.

భగవంతుని ఒప్పుదల పొంది వారి పంథాలో వారి ద్వారానే నడిపించబడు తున్నప్పుడు వారి చిత్తము మనకు వెల్లడి చేయబడుతుంది. కేవలం మన యజమాని ప్రభావాన్నే మన మీద ఒప్పుకున్నప్పుడు వేరే ఏ ఇతర వస్తువు మన మీద రాజ్యాన్ని చెయ్యనప్పుడు మనకు జరగబడేది అంతా భగవంతుడి చిత్తం స్పష్టంగా అవగతమవుతుంది. యజమాని ప్రభావాన్ని ఒప్పుకుని వారి మార్గంలో వారి ద్వారా నడిపించబడ్డ గిరిధర్ వాణి, తమ ప్రయాణంలో గ్రహించబడ్డ అన్వయింపబడ్డ "నిజాలను" ఇక్కడ ప్రకటించడం జరుగుతోంది. యజమాని ప్రభావాన్ని ఒప్పుకున్న తమకు జరగబడింది అంతా యజమాని చిత్తం మేరకే జరగబడినది గ్రహించిన గిరిధర్‌వాణికి తేట తెల్లంగా, స్వయంగా యజమాని బహిర్గతం చేసిన నిజాలను ఇక్కడ ప్రకటించడం జరుగుతోంది. ఇప్పటి దాకా వున్న ఏ ప్రవక్త అయిన, ఏ అవతార పురుషుడైనా, ఏ మతమైనా, ఏ ధర్మమైనా సరే భగవంతుని చిత్త ప్రకారం నడిచిన వారే నిజ భక్తులని ప్రబోధించారు.

కాబట్టి భగవంతుడి చిత్త ప్రకారం నడవడానికి అసలు ఆ చిత్తము ఏమైవున్నదో తెలుసుకోవటం అవసరం. మన మీద ప్రేమతో తన చిత్తాన్ని స్వయంగా తనే చెప్పుకున్న యజమానికి కృతజ్ఞతలు, నమస్కారాలు తెలియచేసు కుంటూ వారి చిత్తాన్ని గ్రహించే ప్రయత్నం చేద్దాం!

భగవంతుని విశ్వసించడం, ప్రేమించడం, ప్రార్థించటం,



గమనించటం, ఒప్పుదల పొందటం, శరణాగతి చేయటం, ఆస్వాదించటం, ఆనందించడం ఇలా అనేక విషయాలలో మనకు మన సొంత అవగాహన, సొంత అభిప్రాయాలు వున్నాయి. అలాగే భగవంతుడు మనకు కల్పించే రక్షణ, మనకు ఇచ్చే ఉద్ధరింపు. మనకు ఇచ్చే సుఖశాంతులు, మనకు బోధించే విద్య మొదలైన విషయాలలో కూడా మనకు మన సొంత అవగాహన సొంత ఆశ వున్నాయి. మనము ఈ సొంత ఇష్టాల వల్ల భగవంతుని ఇష్టాన్ని గ్రహించ లేకున్నాం. సొంత ఇష్టాయిష్టాలనే కళ్ళద్దాలు ధరించిన మనకు నిజం కనపడదు గ్రహింపులోకి రాదు కాబట్టి ముందు మనం మన సొంత అభిప్రాయాలను తెలివి తేటలను, ఆశలను, వాంఛలను త్యజించుదాం! మన ఇష్టాయిష్టాలనే బూజులను దులుపుకుని పరిశుద్ధమైన మనసుతో ఖాళీయైన హృదయంతో భగవంతుని చిత్తాన్ని వినే ప్రయత్నం చేద్దాం. మన ఇష్టాయిష్టాలు మనపై చేస్తున్న పెత్తనాన్ని ఖండించి భగవత్ చిత్తాన్ని మనలను ఏలనిద్దాం! మనపై యజమాని ప్రభావాన్ని ఒప్పుకుని వారిని మనపై రాజ్యం చెయ్యమని ఆహ్వానిద్దాం. భగవంతుడి చిత్తంలో ప్రతీ విషయం యొక్క నిజార్థం ఏమై వుందో తెలుసుకుందాం! అబద్ధమైన మన సొంత అవగాహనను, సొంత **తెలివితేటలను వదిలేయడం వల్ల వచ్చిన ఖాళీని ఆది గురువుకు ఈ సంవత్సరపు గురు దక్షిణగా చెల్లించుదాం !** ఇక ఆ ఖాళీని వారే వారి ఇష్టప్రకారం ఏలుతారు.

## 1. విశ్వాసం

మన దృష్టిలో విశ్వాసం అనగానే ఎంతో అర్ధం వుంది. కానీ భగవంతుని చిత్తంలో విశ్వాసమంటే ఏమైవున్నదో తెలుసుకుందాం. మామూలుగా అయితే "మన అర్ధం ఇది, కానీ అది నిజం కాదు, నిజము ఇదై వున్నది" అని అబద్ధాన్ని కాదంటూ నిజాన్ని ఒప్పుకుంటాం. కానీ నిజాన్ని ఒప్పుకోవటానికి దానిని అబద్ధంతో ఎందుకు పోల్చాలి? అబద్ధమైన మన అవగాహనను వదిలేసి ఆ ఖాళీని గురుదక్షిణగా ఆది గురువైన మన యజమానికి ఇచ్చేసాం కాబట్టి ఇంక ఆ అబద్ధాన్ని గుర్తు చేసుకోవద్దు కేవలం నిజాన్నే గమనించి, గ్రహించి, అన్వయించుకుందాం! అంటే "విశ్వాసం" గురించి మనకిప్పుడు ఏ అభిప్రాయము లేదు, ఇప్పుడు యజమాని ఏం చెప్పబోతున్నారో అదే మన అభిప్రాయము కూడాను. విశ్వాసము అనగా.....

ఏ అర్హతా యోగ్యతా లేని మనిషి కూడా భోగభాగ్యాలతో తుల తూగుతూ విలాసవంతంగా వుండటం మనకు కనపడినప్పుడు ఆ భోగమంతా యజమానికి వారిపై వున్న కృపగా మనకు బోధపడటం విశ్వాసము ఆ **1.** భోగాలను చూసి మనకు న్యూనత భావం, ఆశ, ఈర్ష్య, ద్వేషం లాంటి అరిషడ్వార్గాలు మనలో చెలరేగకపోవటం విశ్వాసము. **2.** ఏమి చూసి వారికి యజమాని ఆ భోగాలను ఇచ్చారో అని యజమానిని విశ్లేషించక పోవటం విశ్వాసము. **3.** అలాగే యోగ్యుడు అర్హత కలవాడు ఎదురైనప్పుడు అతని యోగ్యతకు ఆధారం యజమాని అని బోధపడటం విశ్వాసము. ఆ యోగ్యతను మనమూ పొందాలని వారు అనుసరించిన



మార్గాన్ని మనము అనుకరించకపోవటం (Imitation) విశ్వాసము ఏ యోగ్యతనైనా ప్రసాదించేది యజమానే అని గుర్తువుండి, యోగ్యత పొందడానికి పాకులాడక పోవటం విశ్వాసము **4.** మనకు ఇచ్చేది, ఇస్తున్నది భగవంతుడే అని ఎలా విశ్వసిస్తున్నామో అలాగే ప్రతి ఒక్కరికీ ఇచ్చేది ఇస్తున్నది భగవంతుడే అని నమ్మి మన ద్వారా ఇతరులకు కలిగిన మేలుకు ప్రతి ఫలం ఆశించక పోవటం విశ్వాసము ప్రతీ విషయానికి కదలిక వచ్చి ఆ కదలికకి యజమాని వున్నాడనే విశ్వాసాన్ని చూపి స్థిమిత పరచడం అన్నది అలవాటు కాకపోవటం విశ్వాసము. **5.** ప్రతీ దానికి కదిలిపోయి విశ్వాసం ద్వారా స్థిమితపడటం విశ్వాసం ఎలా అవుతుంది? భగవంతుడు ఆయన పట్ల మనకు కలిగించిన విశ్వాసమనే పవిత్ర భావాన్ని మనం పదే పదే వాడుకున్నట్లు అవుతుంది. తొలి దశలో విశ్వాసం ద్వారా స్థిమిత పడ్డా పదే పదే అదే పని చేయకూడదు. అసలు దేనికైనా ఆధారం బాబానే అని కదలకుండా నిలకడగా నిశ్చింతగా వుండటం విశ్వాసం! **6.** అలా కాకుండా కదలటం, విశ్వాసం ద్వారా స్థిమిత పడటం ఇదే చేస్తుంటే మొదటి మెట్టు ఎక్కడం, మళ్ళీ దిగటం మళ్ళీ ఎక్కడం తోనే కాలం వెళ్ళిపోతుంది. కాబట్టి దేనికి కదలక నిశ్చలుడైన బాబాపై ఆధారపడి నిశ్చింతగా వుండటమే నిజ విశ్వాసము. ఇలాంటి విశ్వాసము అలవర్చు కున్నప్పుడు మన అంతఃకరణ ఎలాంటి ప్రలోభాలకు లోనుకాక పరిశుద్ధంగా వుంటుంది. ఎందుకంటే దేనినైనా ఇచ్చేది యజమాని అని ఆయన కృపకు ఆధారం అవసరం లేదని పూర్తిగా బోధపడింది కాబట్టి అంతఃకరణ ఎలాంటి కోరికలోకి వెళ్ళదు తద్వారా జీవి ఎలాంటి సాధనలోకి వెళ్ళదు

దానితో జీవి మార్గము మీద కాక సదా బాబాపై ఆధారపడుతుంది. బాబా పై ఎలాంటిఒత్తిడి పెట్టకుండా ఎలాంటి( Commands demands)లేకుండా ఆధారపడుతుంది.

సూక్ష్మంగా పరిశీలిస్తే ప్రతీది ఇచ్చేది బాబా అన్న విశ్వాసంతో బాబానే గమనించటం వల్ల జీవిపై ఏ భోగభాగ్యాలు కీర్తి ప్రతిష్టల ప్రభావం పడదు. తద్వార అంతఃకరణ చెలరేగదు దాని ప్రభావం జీవిపై పడదు. ఇలా జీవి నిజ విశ్వాసంలో స్థిర పడటం వలన జీవికి శాంతి లభిస్తుంది. తనదైన తన అంతఃకరణ జీవిని ఇబ్బంది పెట్టకపోవటం వల్ల, ప్రయత్నంలోకి నెట్టకపోవటం వల్ల జీవికి పరాంశాంతి లభిస్తుంది. ఇన్నాళ్ళూ అంతఃకరణ చెలరేగి జీవిని రకరకాలుగా మభ్య పెట్టటం వలనే కదా జీవి నిశ్చలతను కోల్పోయి పరి పరి విధాలుగా ప్రయత్నిస్తూ భంగపడుతున్నాడు. అదేనిజ విశ్వాసాన్ని కలిగి వుంటే నిరాధారుడైన భగవంతుడిపై ఏమీ ఆశించక ఆధారపడటం ద్వారా నిరాధార స్థితిలో వుంటూ పరాంశాంతిని పొందు తుంటాడు. నిజ విశ్వాసం వల్ల జీవి అతిగా అహంకారం లోకి గానీ నిరాశా నిస్పృహలలోకి కానీ వెళ్ళక సమస్థితిలో వుంటాడు. ఈ సమస్థితిలో వుండటానికే మహానుభావు లందరూ ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. కానీ ప్రయోజనం కనబడటం లేదు. భగవంతుడి చిత్తంలో వున్న విశ్వాసాన్ని అలవర్చుకున్న జీవే సునాయాసంగా సమస్థితిలో వుండగలదు. ఈ జీవికి ఎక్కువ, తక్కువ, శుభాశుభాలు లాంటి వ్యత్యాసాలు కాక సమాదరణుడైన యజమానే సదా దర్శనమిస్తూ వుంటారు. కాబట్టి బాబాతో మనకి వున్న అవసరాన్ని విశ్వాసంగా చిత్రీకరించుకోవటం మానేసి నిజ విశ్వాసాన్ని అలవరుచుకుందాం.



## 2. రక్షణ

మనలను రక్షించే విధానంలో బాబా చిత్తము ఏమైవున్నదో తెలుసుకుందాం. మనలను మనలో నుండి రక్షించడమే బాబా చిత్తమై వున్నది. అంటే మనము రక్షణ కోసం వేరే వారి మీద ఆధారపడటం బాబాకు నచ్చదు. బాబా మీదే ఆధారపడాలి ఆయన రక్షణ మనలో నుంచే మనకు కలిగిస్తారు. ఆయన బయట నుంచీ మనకు సహాయపడటాని కన్నా మనలో నుండీ మనకు సహాయపడటానికి ప్రాధాన్యత ఇస్తారు. మనకే పరిస్థితిని ఎదుర్కొనే ధైర్యాన్ని, చాకచక్యాన్ని నేర్పించి మన ద్వారానే విషయాన్ని తేలిక పరుస్తారు. అయితే ఈ విధానంలో మన సొంత ప్రమేయాన్ని ఒప్పుకోరు. అంటే మన చేతులే పని చేసేది కానీ అవి బాబా చేతిలో వుండి ఆడించబడతాయి. తొలిదశలో బాబా బయట నుంచీ సహకరించినా అది అలవాటుగా చేయరు మనలో నుంచే మనకు సహకరిస్తారు. ఈ సహకారాన్ని కూడా అలవాటుగా చెయ్యరు. ఏదైనా మనలని పీడించే విషయము వుంటేనే కదా రక్షించాలి? అసలు ఏ విషయం ఎలాంటి సందర్భాలలో మనలని పీడించలేనప్పుడు మనపై దాని ప్రభావాన్ని చూపించ లేనప్పుడు మనలను ప్రత్యేకంగా రక్షించాల్సిన పని ఏమిటి? ఏ విషయం మనపై పెత్తనాన్ని చెయ్యలేనటు వంటి ధృఢ చిత్తాన్ని మనోబలాన్ని మనకు కలిగిస్తూ, ఆ కలిగిన వాటి వల్ల కూడా మనం అహంకారంలోకి వెళ్ళకుండా చూసుకోవడం ద్వారా బాబా మనలకు నిజ రక్షణ కల్గిస్తున్నారు.

ఏదైనా పరిస్థితి ఎదురై తట్టుకోలేనప్పుడు మనం అమాయకంగా

బాబాని పరిస్థితిని చక్కబెట్టమని వేడుకుంటాం. అంటే పరిస్థితిని బాబాలో అనుసంధానం చేయిస్తాం బాబా ఆ పరిస్థితిని చక్కబెడతారు. ఆ సీన్‌లో వున్న విషయం అంతా బాగుపడుతుంది కానీ మనం మాత్రము అలానే వుంటాం ఇంకో పరిస్థితికి కంగారు పడి మళ్ళీ అంతే అమాయకంగా దానిని బాబాతో అనుసంధానం చేయిస్తాం, ఇలా ఒక దాని తర్వాత ఒకటి విషయం వచ్చి మనలను ఇబ్బందికి గురిచేసి బాబా చేసే సహాయం వల్ల (బయట నుంచీ కానీ మనలో నుంచీ కానీ) అది చక్కబడి వెళ్ళిపోతూ వుంటుంది. మనం విశ్వసించాం కాబట్టి బాబా మనలను రక్షిస్తున్నారని సంతోషిస్తాం కానీ, బాబాను మన అవసరాలను తీర్చే యంత్రంగా విశ్వసించిన మన అబద్ధపు విశ్వాసం మనకు అబద్ధం రక్షణ కలిగిస్తోంది. విషయానికి బాబాకీ ముడి పెట్టి మనలను బాబా నుంచీ దూరం చేస్తుంది. అదే నిజ విశ్వాసము ద్వారా వచ్చిన నిజ రక్షణ మనకీ బాబాకీ ముడి పెట్టి మనలను సమస్యల నుండీ దూరం చేస్తుంది.

మనలను ఎంతో ధృఢంగా చేసి మన ధృఢత్వం ముందు ఏదీ సమస్యగా తోచకుండా వుండేలాగా తీర్చిదిద్దటమే బాబా చిత్తంలో నిజ రక్షణ. దీనిని నిశితంగా పరిశీలిస్తే మనకు తెలిసిన దానికి (అబద్ధానికి), మనము తెలుసుకోవాల్సిన దానికి (నిజానికి) ఎంత సూక్ష్మమైన తేడాలు వున్నాయో తెలుస్తుంది. మనకి ఏదైన విషయం సమస్యగా తోచి దానిని బాబా పరిష్కారం చేయడం నిజ రక్షణ కాదు అసలు మనకు ఏదీ సమస్యగా తోచక పోవటం నిజ రక్షణ. ఏ పరిస్థితి ద్వారా కూడా చేధింపబడలేనటు వంటి ధృఢత్వాన్ని మనకు ప్రసాదించటమే బాబా



చిత్తంలోని రక్షణ. వజ్రాన్ని కూడా చేధించవచ్చేమో కానీ బాబా యొక్క నిజ రక్షణలో జీవికి అలవడిన ధృఢత్వాన్ని చేధించేది సృష్టించబడలేదు.

ఈ ధృఢత్వాన్ని అలవర్చుకున్న జీవి దగ్గర బాబా కాపలాదారుడిలా సేవకుడిగా వుండరు దర్జాగా యజమానిగా తన నిజ స్థితిలో వుంటూ నిజాన్ని ఆస్వాదిస్తారు. ఇలా భగవంతుడు, భక్తుడు ఒకే నిజాన్ని ఆస్వాదించటం వల్ల ఏకత్వాన్ని కలిగి వుంటారు. ఏకత్వం అంటే భగవంతుడి కీర్తి ప్రతిష్టలు, భోగభాగ్యాలు, మహిమలలో పోలినవారమై వుండటం కాదు భగవంతుడిని ఆయన నిజ అవస్థలో వుండనిస్తూ ఆ స్థితిలో వున్న ఆస్వాదననూ మనమూ పొందటమే ఏకత్వాన్ని కలిగి వుండటం. భగవంతుడి చిత్త ప్రకారం వుండటం ద్వారా బాబాలో ఏకత్వాన్ని అంటే ఏకమైన అనుభూతిని, ఏకమైన చిత్తాన్ని, ఏకమైన తత్వాన్ని కలిగి వుంటాం. బాబా చిత్తమే మన చిత్తముగా, బాబా తత్వమే మన తత్వంగామారి జీవి యొక్క జీవతత్వపు ఛాయలు క్రమేణా పోతాయి. ఈ నిజ రక్షణ వల్లమనపై ఏదీ పెత్తనం చెయ్యలేదు కాబట్టి మనమూ యజమాని హోదాను అనుభవిస్తాం.

భగవంతుడిని కీర్తించటం, స్తుతించటం, కృతజ్ఞతలను చెప్పుకోవటమే ఇంక మనకు మిగిలిన పని కానీ, ఏడుస్తూ ఎడతెగక ప్రార్థించటం, సుదర్శనం ధరించి విషయాలపై యుద్ధాలు చేయటం మన పని కాదు. ఈ నిజ విశ్వాసం వల్ల జీవి అంతఃకరణ పరిశుద్ధం కావించబడితే, నిజ రక్షణ వల్ల జీవికి ధృడత్వం ఏర్పడి ఎరుక, స్పృహ పదును తేలుతాయి. జీవికి అలవడ్డ నిజ విశ్వాసం తద్వారా ఏర్పడ్డ నిజ రక్షణ వల్ల జీవి తన

జీవి తత్వము నుండీ విడుదల పొంది ధృడత్వాన్ని, సమస్థితినీ, ఏకత్వాన్ని పొంది ముక్తి నొందుతున్నాడు. **జీవన్ముక్తుడు** అవుతున్నాడు. ఈ జీవన్ముక్తిని పొందటానికి మన అవగాహనతో మన చిత్త ప్రకారం వెళ్తే ఎంత ప్రయాస పడాలో, బాబా చిత్త ప్రకారం వెళ్తే అంత సునాయాసం అవుతుంది. ఇలా ధృడమైన ఇంద్రియాలు, పరిశుద్ధమైన అంతఃకరణ, పదునైన ఎరుక, స్పృహ కలిగి, తన తత్వం నుండీ విడుదలై, భగవంతునితో ఏకత్వాన్ని పొందుతూ ధన్యుడవుతున్నాడు జీవి.



## 3. గమనింపు : (Observation)

మనము బాబాకి చేస్తున్న పూజ, సేవ, ప్రార్థన లాంటివాటిని గమనించటం లేదా బాబా మనకి ఇస్తున్న ఆశీర్వాదం, కీర్తి ప్రతిష్టలు, ఐశ్వర్యం, రక్షణ, ఉద్ధరింపు లాంటివి గమనించటానికే మన గమనింపు పరిమితం కావటం బాబా చిత్తము కాదు. బాబాకి, మనకి మధ్యన వుండే ఇచ్చిపుచ్చుకోవటాలని గమనించటం మాత్రమే చాలదు. ఇది చాలా తొలిదశలలో వుండే గమనింపు మాత్రమే కానీ ఇదే నిజ గమనింపు కాదు.

బాబా చిత్తములో గమనింపు ఇంకా ఏమై వున్నది అంటే : బాబా మన పట్ల చూపిస్తున్న శ్రద్ధ గమనించాలి, ఆయన పని తీరు గమనించాలి. ఆయన ఎలాంటి సందర్భాలలో స్పందిస్తున్నారు ఎలాంటి సందర్భాలలో స్పందించటం లేదు గమనించాలి, ఆయన పని తీరులో వున్న విశిష్టతను, సామర్థ్యాన్ని, చతురతని గమనించాలి. ఆయన చేస్తున్న హెచ్చరికని గమనించాలి, ఆయన హృదయాన్ని, (చిత్తాన్ని) గమనించాలి, ఇక్కడ బాబా మనకు చేస్తున్న పనిని కాక ఆయన పని తీరులోని విశిష్టతని ఆయన కనబరుస్తున్న శ్రద్ధని గమనించాలి అనుకున్నాం కదా దీనిని ఒక ఉదాహరణతో అర్థం చేసుకొందాం లేదంటే సత్యానికి, అసత్యానికి వున్న ఆ సన్నటి వ్యత్యాసం బోధపడదు.

**ఉదా :** బాబా భోజనాన్ని ఇచ్చారు అనుకొందాం మామూలుగా అయితే ఆ భోజనాన్ని కళ్ళకద్దుకుని స్వీకరించి ఆనందిస్తాం అయితే దానితో సరిపెట్టుకో కూడదు. సమయానికి భోజనాన్ని అందించిన బాబా శ్రద్ధ

మన గుర్తింపులోకి రావాలి; ఆ భోజనాన్ని స్వీకరించటానికి మనలో ఆకలిని, తిన్నాక ఎలాంటి Side Effects లేకుండా దానిని అరిగించుకోగల్గిన శక్తిని బాబా ఇచ్చారు అని గమనింపులోకి రావాలి.

ఒక వస్తువుని పుచ్చుకోవడానికి కావల్సిన అర్హతని ఇచ్చి, దానిని నిలుపుకోగల్గిన సత్తాని కూడా ఇస్తున్న బాబా శ్రద్ధ గమనింపులోకి రావాలి. బాబా మనకు నిర్విషయ సుఖాన్ని ఇవ్వదలచుకున్నారు దాని కోసం ఆయన మనలకు ముందుగా దానిని స్వీకరించటానికి కావల్సిన పరిశుద్ధత అనే అర్హతను ఇచ్చారు. ఆ నిర్విషయ సుఖాన్ని నిలుపుకోవాలంటే ఎంత సహజంగా వుండాలో నేర్పించారు. ఇదంతా గమనింపు లోకి రావాలి కానీ బాబా నాకు నిర్విషయ సుఖాన్ని ఇచ్చారు ఆభరణాన్ని ఇచ్చారు అని లెక్క రాసుకుని అవి మనకు వాడబడుతున్నాయా లేదా అని చూసుకుని వాడబడకపోతే "ఏంటి బాబా ఇంకా Work out లోకి రావట్లేదు? మాట తప్పుతున్నావు?'' అని బాబాకి Claim చేయకూడదు.

ఈక్షణం ఇప్పుడు బాబా వారి చిత్తాన్ని చెప్పటానికి ఎప్పటి నుంచో ఎంత ground prepare చేసారు, మనకు "నువ్వు భగవంతుడివే'' అని చెప్పారు, ఆ భగవత్ తత్వాన్ని (it ని) ఎలా పని చెయ్య నివ్వాలో చెప్పారు, స్వధర్మాన్ని ఆచరింపచేసి సుఖాన్ని ఇచ్చారు. పరిశుద్ధతలో నిలిపి నిర్విషయ సుఖాన్ని ఇచ్చారు. సహజత్వమనే ఆయన సొంత లక్షణంలో మనలకి Share ఇచ్చి ఆయనకు మరింత దగ్గరయ్యామనే అర్హతని చూపుతూ ఆయన చిత్తాన్ని చెప్తున్నారు. "నా లాంటి సహజమైన Dress వేసుకున్నారు మీరూ నేనూ ఒకటే'' అని అనుకుంటూ ఆయన హృదయాన్ని మన



ముందు తెరుస్తున్నారు. ఇదంతా మన గమనింపులోకి రావాలి కాని బాబా నాకు సాయిజ్యాన్ని ఇచ్చారు సాలోక్యాన్ని ఇచ్చారు. ఆభరణాన్ని ఇచ్చారు అన్నవి మాత్రమే గమనింపులోకి రాకూడదు.

ఇలాంటి నిజ గమనింపు వల్ల మనకు **వివేకము** ఏర్పడుతుంది. మనము అనుకునే మంచి చెడుల విచక్షణ కాదు ఈ వివేకము భగవంతుడి పని తీరుకి, Results కి మధ్య తేడాను చూపగల్గే నిజ వివేకము ఏర్పడుతుంది. భవనం మలచబడేప్పుడు, ఆ మలచబడిన తీరులో బాబా వుంటారు కానీ అది పూర్తయిపోతే భవనమే బాబా యొక్క మహిమకి గుర్తుగా వుంటుంది. భవనాన్ని గమనిస్తే బాబా మహిమను గమనించినట్లు. భవనం మలచబడేప్పుడు ఆ విధానం గమనిస్తే బాబా పని తీరుని చాకచక్యాన్ని, సత్తాని గమనించినట్లు, పూర్తయిన భవనాన్ని బాబా ప్రసాదంగానే ఆస్వాదిస్తున్నాం కదా, బాబానే యజమానిగా పెట్టుకుని ఆస్వాదిస్తున్నాం కదా, బాబాని తోడు పెట్టుకునే ఆస్వాదిస్తున్నాం కదా అంటే పని తీరుని కూడా గమనించినప్పుడే ఇవన్నీ నిజాలు అవుతాయి. పని తీరుని గమనించకుండా ఇవన్నీ చేస్తే మన భావాన్ని మనం ఆనందిస్తున్నాం అంతే! నిజ గమనింపు వల్ల ఏర్పడ్డ నిజ వివేకంతో మనకు నిజ భగవంతుడు నిజంగా అర్థమవుతూ నిజ ఆనందం మన సొంతమవటం మొదలవుతుంది.

## 4. గ్రహింపు : (Observation)

నిజ గ్రహింపు అంటే ఏమిటో నిజ గమనింపు ద్వారా అది ఎలా సాధ్య మవుతుందో చూద్దాం! బాబా మన మీద శ్రద్ధ చూపుతున్న విషయం గమనింపులోకి రాగానే బాబా మనలని ప్రేమిస్తున్నారనే విషయం గ్రహింపులోకి రావాలి. అంతటి యజమానే మనలను ప్రేమిస్తున్నారనే విషయం గ్రహింపులోకి వస్తుంది. బాబా పని తీరుని గమనించినప్పుడు వారి దగ్గర ఏ ఏ లక్షణాలు వున్నాయో గ్రహింపుకు వస్తుంది. అలాగే వారి దగ్గర ఏ ఏ లక్షణాలు లేవో గ్రహింపులోకి వచ్చి బాబా దగ్గరలేని ఆ లక్షణాలన్నీ జీవ లక్షణాలుగా గ్రహించి వాటిని త్యజిస్తుంది జీవి.

బాబా పని తీరుని గమనించినప్పుడు బాబా దగ్గర కోపం లేదు, విసుగు లేదు, భయం లేదు, అనుమానం లేదు, అహంకారం లేదు, ఆశింపు లేదు, పెత్తనం లేదు, ఇలాంటి విషయాలన్నీ గ్రహింపులోకి వస్తాయి. కోపం, విసుగు, ఆశ, అహంకారం, సంశయం, భయం, పెత్తనం లాంటి వన్నీ జీవ లక్షణాలుగా గ్రహిస్తుంది జీవి. ఆ గ్రహింపు వల్లే ఆ జీవ లక్షణాలన్నీ జీవికి వదిలేయబడతాయి. ఎప్పుడైనా తిరిగి తలెత్తినా అవి జీవ లక్షణాలన్న గ్రహింపు గుర్తుకు వచ్చి వదిలేయబడతాయి.

అంటే కేవలం ఈ నిజ గ్రహింపు వల్లే జీవికి తన సొంత లక్షణాలు వదిలేయబడి జీవి నిజ వైరాగ్యాన్ని పొందుతోంది. బాబా దగ్గర ఫలానా లక్షణం లేదని గ్రహించిన జీవికి ఆ లక్షణం పట్ల విరక్తి ఏర్పడి ఆ లక్షణాన్ని వెనువెంటనే సన్యసిస్తూ నిజ సన్యాస లక్షణాన్ని పొందుతోంది. జీవ లక్షణాలనే బంధాల నుండీ విడుదల అవుతోంది.



## 5. అన్వయింపు : (Adoption)

భగవంతుని దృష్టిలో నిజ అన్వయింపు ఏమైవుందో తెలుసుకుందాం! బాబా పని తీరులోని విశిష్టతను గమనించడం అనే నిజ గమనింపు వల్ల బాబా దగ్గర లేని, జీవి దగ్గర మాత్రమే లక్షణాలు గ్రహించి వాటిని జీవ లక్షణాలుగా గ్రహించింది జీవి. ఆ నిజ గ్రహింపు వల్ల జీవి తన జీవ లక్షణాలను సన్యసించింది. ఇప్పుడు ఆ జీవ లక్షణాల స్థానే నిజ లక్షణాలను అన్వయించుకుంటుంది.

ఈ (Adoption) జాగ్రత్తగా నిజంగా జరుగక పోతే జీవి అహంకారంలోకి వెళ్ళే Chance వుంది. బాబా నిమిత్త మాత్రంగా వుంటారు అన్న విషయాన్ని గ్రహించినప్పుడు దానిని Adopt చేసుకోవటానికనే జీవి కూడా నిమిత్త మాత్రంగా వుండే ప్రయత్నం చేయకూడదు. బాబా దర్జాగా వుంటారు అన్న విషయాన్ని గ్రహించినప్పుడు దానిని Adopt చేసుకోవటానికని జీవి కూడా దర్జాగా వుండటానికి ప్రయత్నం చేయకూడదు. అంటే లక్షణాన్ని ఆపాదించు కోవటానికి ప్రయత్నం చేయకూడదు. ప్రయత్నిస్తే బాబాని అనుకరించినట్లు (imitate చేసినట్లు) అవుతుంది కానీ అన్వయించుకున్నట్లు (Adopt చేసుకున్నట్లు) కాదు.

నిజ అన్వయింపుకు ప్రయత్నం అడ్డు అవుతుంది. ప్రయత్నించకుండా ఎలా Adopt అవుతాయి అంటే సహజంగా Adopt అవ్వాలి. సహజంగా ఎలా Adopt అవుతాయంటే : బాబా మనపై చూపిన శ్రద్ధని

గమనించిన జీవికి, అది బాబాకి మనపై గల ప్రేమగా జీవికి గ్రహింపు వస్తోంది కదా! ఆ గ్రహింపు పదే పదే జరుగుతున్నప్పుడు జీవి కంగారుపోయి భావ రహితంగా కదలికలు లేకుండా ఎలాంటి ఆలోచనా లేకుండా నిలకడగా వుండిపోతుంది. జీవి భావ రహితం, చలన రహితం అవ్వటంతో ప్రయత్నం ఆగిపోతుంది. అప్పుడు బాబా ప్రేమే జీవిపై ప్రసరిస్తూ వుంటుంది. ఆ ప్రేమతో నిలకడగా వున్న జీవికి నిజ లక్షణాలు సహజంగా ఏ ప్రయత్నం లేకుండా అన్వయింపబడతాయి. అదే ప్రయత్నం చేసి అన్వయించు కోవాలంటే జీవి కాలాన్ని ఎదుర్కోవాల్సివుంటుంది. అంటే ఎంత కాలానికి ఆ ప్రయత్నం ఫలిస్తుందో చెప్పలేం కదా ! అదే ప్రయత్నం లేక సహజంగా వుంటే గ్రహింపులోకి వచ్చిన కాలంలోనే అన్వయింపు జరిగిపోయి కాలం వృధా కాదు.

ఇలా ఒక్కో లక్షణం జీవికి త్వరత్వరగా అన్వయింపబడుతూ జీవితన స్వస్వరూపాన్ని పొందుతుంది. Imitation పోయి నిజ Adoptionవల్ల జీవి తన నిజ స్వరూపాన్ని ఎంతో సునాయాసంగా పొందవచ్చు. తనకు అన్వయింపబడ్డ లక్షణాలు చూసుకుని జీవికి అహంకారం రాదు ఎందు కంటే జీవిబాబాప్రేమనుగ్రహిస్తూనే వుంటుందిఆ ప్రేమతోనిలకడగానేవుంటుంది కదా! ఇలా నిజ అన్వయింపు వల్ల జీవి నిజలక్షణాల పంట చెడిపోక పరిపక్వ దశ వైపుకే వెళ్తుంది. ఇలా నిజ లక్షణాలు పొందటానికి జీవికి ఏ ఆధ్యాత్మిక విద్యా మహిమా అవసరం లేదు. కేవలం నిజమైన గమనింపు గ్రహింపు, అన్వయింపుల వలననే పని జరిగిపోతుంది. Imitation కి Adoptionకి వున్న వ్యత్యాసం తెలుసుకుంటే బాబా ఉద్దేశ్యం బోధపడినట్లే.



**6. అన్వయింపబడిన లక్షణాలను ఉపయోగించటం:-** (Application)

Adopt చేసుకున్న నిజ లక్షణాలను ఉద్దేశ్యం పూర్వకంగా ఒక ప్రకారం ఉపయోగపెట్టుకోవటం భగవంతుని చిత్తం కాదు. Adopt అయిన లక్షణాలు వాటంతట అవి Apply అవ్వడం బాబా చిత్తమైవుంది బాబా ఉద్దేశ ప్రకారం వుంటే Adopt అయినవి వాటంతట అవే Apply అవుతాయి కాబట్టి బాబా ఉద్దేశమేమిటో తెలుసుకుందాం!

శరణాగతిలో జీవి ఎప్పటికీ వుంటే ఈ application సులభంగా అవుతుందని బాబా అభిప్రాయం. బాబాని యజమానిగా స్వీకరించి ఆయనపై ఆధారపడి ఆయన ప్రభావాన్ని మనపై ఒప్పుకోవటం దగ్గర మొదలైన శరణాగతి జీవిలో రోజు రోజుకీ మరింత ధృడమవుతూ వస్తుంది. (శరణాగతి గురించి పూర్తి వివరం "స్వధర్మం" అనే Book లో వుంది). అయితే ఇక్కడ ఈ దశలో శరణాగతి ఎలా వుండాలో చూద్దాం!

నిజ విశ్వాసం, రక్షణ, గమనింపు, గ్రహింపు, అన్వయింపుల ద్వారా మనకు బాబా యొక్క ప్రతీ చర్య అర్థమవుతుంది. దాంతో జీవి యొక్క సమస్తమూ భగవంతుని గురించి తెలుసుకుంటుంది తిరిగి జీవికి బోధిస్తుంది. అంటే జీవికి మనసు ఒక గురువు, హృదయం ఒక గురువు, పరిస్థితి ఒక గురువు, కాలం ఒక గురువు ఇలా అనేక గురువులు ఏర్పడుతారు జీవికి. ఒక పరిస్థితి ఎదురై దానిలో విజయం సాధించినప్పుడు ఆ వచ్చిన పరిస్థితి జీవికి ఒక సత్యం నేర్పి గురువు అవుతుంది కదా! అలాగే కాలం గడిచే కొద్ది జీవికి ఒక విషయం పట్ల మరింత అవగాహన

పెరుగుతుంది ఆ విషయాన్ని నేర్చుకుంటుంది దాంతో జీవికి కాలమూ గురువు అవుతుంది కదా! అలాగే జీవికి బాబా పై వున్న ప్రేమ మరికొంత సత్యాన్ని నేర్పి అదికూడా జీవికి ఒక గురువు అవుతుంది. జీవికి ఏర్పడ్డ నిజ తత్వం కూడా జీవికి ఒక గురువు అవుతుంది. ఇలా జీవికి ఇంద్రియాల దగ్గర నుంచీ స్వస్వరూపం దాకా ప్రతీదీ ఏదో ఒక సత్యాన్ని తెలియచేస్తూ జీవి లోని చీకటిని తొలగించి జీవిని వెలుగు మయంగా తేజోమయంగా చేస్తున్నాయి.

జీవిని చీకటి మార్గం నుంచీ తొలగించి వెలుగువైపుకు నడిపే వారిని గురువు అంటాము కాబట్టి పైన పేర్కొన్నవన్నీ జీవికి గురువుగా ఏర్పడతాయి. అంటే నిదానంగా జీవి యొక్క సమస్తము యొక్క ప్రభావం తిరిగి జీవిపై పడుతుంది. అది సత్య ప్రభావమే కాబట్టి ఫరవాలేదు. అయినా ఆ సత్య ప్రభావం నిదానంగా తగ్గి అసత్య ప్రభావం అయ్యే అవకాశం లేకపోలేదు. అప్పుడు జీవికి తన సంపాదనని చూసి అహంకారం వస్తే ఆ సంపాదన జీవికి ఉపయోగపడదు అంటేApplication లోకి రాదు.

కాబట్టి సత్య ప్రభావమే అయినా సరే దానిని మనపై పెత్తనం చేయనీయ కూడదు. ఆ సత్యానికీ యజమానిని చూపాలి. మన సమస్తానికీ ఆధారమై తిరిగి సమస్తాన్నీ కలిగి వున్న యజమాని వున్నారని గుర్తించి, వారిని సదా గుర్తించుకుని, వారిని ఆది గురువుగా స్వీకరించి ఆయనకు శరణాగతి చేసినట్లైతే ఆయన ప్రభావమే మనపై పడుతుంది దాంతో మన సమస్తమూ మనకు చెప్పిన సత్యాన్ని అంగీకరించటం వల్ల ఏ దోషం



వుండదు. అంటే ఎంత స్వస్వరూపాన్ని పొందినా కూడా ఆ స్వస్వరూపానికి ఆధారమై వున్న యజమానికి శరణాగతి చెయ్యకపోతే ఆ స్వస్వరూపం వాడుకలోకి రాబడదు.

ఒక వేళ జీవి Plan వేసి అమలు లోకి తెచ్చుకున్నా అది సదా నిలవదు సరి కదా జీవిపై ఆ సంపద పెత్తనం చేస్తుంది. అంటే ఆ సంపదని కాపాడు కోవటం, రక్షించుకోవటంతో జీవి ఆస్వాదన పోతుంది. ఆ సంపద జీవికి గర్వాన్ని భయాన్ని రెండూ ఇస్తుంది. అదే ఆది గురువైన యజమానికి ఇంకా శరణాగతి చేస్తుంటే ఆ యజమాని ఆధ్వర్యంలో Application ఏ Side Effects లేకుండా జరుగుతుంది. అదే శరణాగతి లేని Application మూడ్నాళ్ళ ముచ్చటే. మనకు సత్యం బోధపడాలి కానీ బోధపరుస్తున్న విషయం మనపై ప్రభావం చూపకూడదు అన్నది బాబా చిత్తమైవుంది.

అంటే అన్వయింపబడ్డవిషయం, అన్వయింప చేసిన విషయం రెండూ మనపై ప్రభావం చూపకూడదు ఎప్పటికీ యజమాని ప్రభావమే మనపై నిలిచి వుండాలన్నది బాబా చిత్తమైవున్నది. అన్వయింపబడినది యజమాని ఆధ్వర్యంలో వాడుకలోకి రావాలన్నది బాబా చిత్తమై వున్నది. లేదంటే అన్వయించుకున్న సత్యమే జీవిపై అధికారం చేస్తుంది జాగ్రత్త అని హెచ్చరించటం బాబా ఉద్దేశమై వుంది.

ఇప్పటి దాకా చెప్పుకున్న Logic ఎవరికైనా అర్థం కాకపోతే ఈ ఉదాహరణ గమనించండి. White dress అందాన్నిస్తుంది, ఆహ్లాదాన్ని స్తుంది, ప్రశాంతమైన భగవంతుని ప్రతిఫలిస్తుందని తెలుసుకుని White

dress ని ధరించాం. కానీ ధరించిన దగ్గర నుంచీ మరకలు అంటుతాయని జాగ్రత్త పడినా, మన ముందు మిగతావన్నీ తేలికగా కనబడినా, Dress పాడవుతుందని మనం ఏ పనీ చేయక కదలకుండా కూర్చున్నా dress ప్రభావం మన మీద పడినట్లేనా? White dress వల్ల రావల్సిన అందం, ప్రశాంతత Application లోకి రాకపోగా జీవికి ఇరికించినట్లు అవుతుంది కదా! అదే యజమానిని గుర్తుచేసుకుని dress కి ప్రాధాన్యత ఇవ్వక పోతే జీవి హాయిగా వుంటాడు dress యొక్క Look application లోకి వస్తుంది. జీవీ Safe, dress కూడా Safe Dress! అన్నా ఒకటి పోతే మరోటి వస్తుంది కానీ చేజారిన లక్షణం తిరిగి అన్వయించుకోవటానికి ఎంత time పడుతుంది ఆ వృధా అయిన కాలం తిరిగి రాదుగా !

ప్రతీ విషయంలో బాబాను గ్రహిస్తున్నామంటే ఆ విషయ ప్రభావాన్ని ఒప్పుకున్నట్లు కూడా అవుతుంది అని, ఆ విషయంలో పండిన సత్యానికి విషయపు వాసనా అంటి వుంటుంది దాని నుంచీ జాగ్రత్త పడాలి అందుకు యజమానిని సదా గుర్తుంచుకుని ఆయన ప్రభావాన్ని ఒప్పుకోవాలి అప్పుడే నిజ లక్షణాలు వాడబడతాయన్న సూక్ష్మం బాబాకు తప్ప ఎవరికైనా తెలుస్తుందా? అందుకే బాబా చిత్తాన్ని తెలుసుకోవాలని ప్రతీ వారు ఆరాటపడేది. ఆ చిత్తాన్ని తెలుసుకునే భాగ్యము వున్న మనం మన భాగ్యాన్ని తేలికగా తీసుకుని నిర్లక్ష్యం చేయద్దు అలా చేస్తే మనకన్నా పాపులు ఇంకొకరు వుండదు.

సృష్టి మొదటి నుంచీ ఇప్పటి దాకా లంకె బిందలున్నా వాడబడని వారెందరో వున్నారు కదా! అంటే తత్వాన్ని తెలుసుకున్నా వాడుకలోనికి



తెచ్చుకోలేకపోయిన వారెందరో వున్నారు కదా! మరి మనకు లంకె బిందెలని ఇస్తూ వాటిని వాడుకలోకి కూడా తెచ్చుకోవటం నేర్పిస్తున్న ఆది గురువుకి మనం ఎంత కృతజ్ఞులమై వుండాలో కదా! ఆది గురువుకి మన మీద ఎంత శ్రద్ధో ఎంత ప్రేమో కదా! అంతటి ప్రేమమయులైన ఆది గురువుకు అనంతకోటి నమస్కారాలు అర్థవంతమైన కృతజ్ఞతలు చెల్లించుకుందాం! వారిని మన యజమానిగా ఆది గురువుగా ఒప్పుకుని సత్కరిద్దాం వారిని అనుసరిస్తూ సన్మానిద్దాం!

## 7. స్వతంత్రత :

ఇక్కడ మనం చెప్పుకుంటున్న స్వతంత్రత సర్వవిధ పూర్ణమైన స్పృహ గురించి ఈ విషయంలో బాబా చిత్తమేమయివుందో తెలుసుకుందాం. మనము మనలో దివ్యత్వము వుందని గుర్తించి దానిని పనిచేయనిస్తూ వుండాలని తెలుసుకున్నాం. మనము ఆ పని తీరుకి సాక్షిగా వుండాలని తెలుసుకున్నాం. ఆ పని తీరుని నిజంగా ఎలా గమనించాలో, గ్రహించాలో, అన్వయించుకోవాలో, వాడుకలోకి తిరిగి తెచ్చుకోవాలో ముందు రోజుల్లో తెలుసుకున్నాం. ఏదైతే మనలో పని చేస్తోందో మనం దాని స్వభావాన్ని సంతరించుకోవాలి కానీ కేవలం ఫలాన్ని ఆస్వాదిస్తూ దాని ప్రభావంలోకి వెళ్ళకూడదని తెలుసుకుందాం. ఈ తెలియబడ్డ విషయాల వల్ల మనం కోరికల నుండీ, ద్వంద్వాల నుండీ, జీవ లక్షణాల నుండీ, విషయ ప్రభావాల నుంచీ విడుదల పొంది ధృడత్వాన్నీ, పరాంశాంతిని, సమస్థితినీ, వివేకాన్నీ, నిజవైరాగ్యాన్ని, స్వస్వ రూపాన్నీ సొంతం చేసుకున్నాం. ఈ సొంతమైన సంపదల ప్రభావం మనపై పడకుండా వాడుకలోకి తెచ్చుకోవటానికి ఆది గురువుని సదా గుర్తుంచుకుని శరణాగతి చెయ్యాలని తెలుసుకున్నాం!

అయితే దాస్యాత్మ లాగా ఒకరిపై ఆధారపడి వుండటం కాక స్వతంత్రంగా రాజాధిరాజుగా (Individual) వుండగల్గటం అన్నది నిజము. మరి ఎప్పటికైనా శరణాగతి చెయ్యాల్సిందే అన్న నిజము స్వతంత్రంగా వుండాలి అన్న నిజము రెండూ పరస్పరం విరుద్ధంగా కనిపిస్తాయి. ఈ పరస్పర విరుద్ధ నిజాలను సొంతం చేసుకొనే విధానం గురించి బాబా చిత్తము ఏమైవుందో తెలుసుకుందాం.



జీవిలో వున్న దివ్యత్వపు లక్షణాలను జీవి యొక్క స్పృహ కూడా కలిగి వుండాలని బాబా చిత్తమై వుంది. ఏ స్పృహైతే నేను జీవిని అని ఎరుగుతోందో ఇది భగవంతుడు అని ఎరుగుతోందో ఆ స్పృహ పూర్తి పూర్తి స్థాయిలో దివ్యత్వపు లక్షణాలు (నిజ లక్షణాలు) తప్పకుండా పొంది వుండాలి. ఆ స్పృహ తన పరిధిని మరింతగా పెంచుకోవాలి. ఆ స్పృహ స్వతంత్రంగా వుండాలి. దాని మీద ఉద్ధరింపబడాలి అన్న ఒత్తిడి కూడా వుండ కూడదు. ఆ స్పృహ ఏ ఒత్తిడికి గురికాకుండా మరింత తేలికగా అయిపోతుండాలి. ఆ స్పృహ యొక్క సామ్రాజ్యంలో జీవి యొక్క సమస్త సైన్యము పని చేస్తూ వుండాలి. జీవి సైన్యము తమ పని కోసం కూడా ఆ స్పృహ పై ఆధారపడక ఆ స్పృహకీ ఆధారమైన Ultimate పై ఆధారపడతాయి. అంటే జీవి సైన్యము తమ సామ్రాజ్య అధిపతి అయిన స్పృహ యొక్క యజమానికి శరణాగతి చేస్తున్నాయి. ఇలా స్పృహ మీద ఎవరూ ఆధారపడక పోవటం జరుగుతుంది. ఏ బరువూ లేని స్పృహని ఏ భ్రమలో అన్వేషణలో లేని స్పృహని మూలమే దానంతట అదే Grip చేసుకుని వుంటుంది స్పృహ వైపు నుంచీ ఈ స్పృహని మూలం దానంతట అదే వరిస్తుంది. స్పృహ వైపు నుంచీ ఎలాంటి ప్రయత్నం, శరణాగతి లేకుండానే మూలము దానిని Grip చేస్తుంది. కేవలం ఉనికిగా వ్యవస్థితం అవుతున్న ఏ స్పృహ అయినా మూలం యొక్క Continuous Connection లో వుంటుంది. స్పృహ ప్రయత్నించి దేని మీదా ఆధారపడక్కర్లేదు అంటే మూలాన్ని ఒక చేతిగా అనుకుంటే స్పృహ దాని మీద గీతలాగా చెక్కబడిపోయి గీయపడిపోయి వుంటే ఆ స్పృహ ప్రత్యేకంగా చేతి మీద ఆధారపడక్కర్లేదు కదా!

ఇలా పైన పేర్కొన్న స్పృహ దేని మీదా ఆధారపడదు, దానిపై ఎవరూ ఆధారపడరు కాబట్టి ఆ స్పృహ స్వతంత్రంగా వున్నట్లేగా!ఆ జీవి స్పృహ స్వతంత్రంగా వుంటే జీవి యొక్క మిగతా సైన్యం అంతా స్పృహ మూలానికి అంటే ఆది దేవునికి శరణాగతి చెయ్యాల్సిందే. ఇలా శరణాగతి, స్వతంత్రత ఒకే జీవి యొక్క Package లో పక్క పక్కనే వుంటాయి. శరణాగతి వల్ల స్వతంత్రత పోదు; స్వతంత్రత వల్ల శరణాగతి తగ్గదు.అంతే కానీ జీవి మొత్తంగా స్వతంత్రంలోకి వెళ్ళిపోయి ఏదో ఒక స్థితిలోనో మహిమలోనో ఇరుక్కుపోవటం బాబా చిత్తం కాదు అలాగే జీవి యొక్క సమస్తమూ శరణాగతిలోకి వెళ్ళిపోయి ఒక దాస్య స్పృహగా మారిపోవటం బాబా చిత్తం కాదు.

ఇది పూర్తిగా సరిగ్గా అర్థం చేసుకోక పోతే జీవి స్వతంత్రాన్ని పొందదు. జీవి యొక్క సమస్తమూ (స్పృహ తప్ప) బంధాల నుండీ, ప్రభావాల నుండీ స్వతంత్రత పొందితే మూలానికి శరణాగతి చేస్తే జీవి యొక్క స్పృహ యజమాని చేతిలో వుండటం ద్వారా స్వతంత్రని పొందుతుంది. ఈ స్వతంత్రత లేని జీవికి నిజ ఆధ్యాత్మిక అభివృద్ధి, నిజ ఆధ్యాత్మిక విలువ వుండవు అలాగే శరణాగతిలో వున్న సైన్యము లేని జీవికి ఇహంలో ఏ రాణింపు విలువ వుండవు స్వతంత్రత కలిగి లేకపోతే బాబా పోషణ అందదు శరణాగతి లేకపోతే ప్రకృతి సహకారం అందదు.

మొదటి నుంచీ ఇప్పటి దాకా నేర్చుకున్న సమస్త విషయాలు అన్వయించు కున్నప్పుడే స్పృహ స్వతంత్రించబడుతుంది. కేవలం స్వతంత్రతని కలిగి బాబాకి ఎదురీదినా, కేవలం శరణాగతి కలిగి బాబా



చేత పోషించబడినా బాబాకు తృప్తి వుండదు. స్వతంత్రతని శరణాగతిని సరైన రీతిలో కలిగి వున్న జీవిని చూస్తేనే బాబాకు తృప్తి, ఆనందం కలుగుతాయి.

అయితే ఇప్పటి దాకా తెలుసుకున్న విషయాల అన్వయింపుతోను, స్వతంత్రత ప్రదాత యజమానే అన్న గ్రహింపుతోనూ, గుర్తుతోనూ మాత్రమే ఈ స్వతంత్రత సాధ్యమవుతుంది. అందుకే స్వతంత్రతను గురించే చెప్పుకునే ముందు టూకీగా ముందు విషయాలను గుర్తు చేసుకోవటం జరిగింది. శరణాగతిని బోధించి నిరూపించటంతో పాటు స్వతంత్రనీ ప్రసాదిస్తారు కాబట్టే మన యజమాని పరిపూర్ణులు అఖండ పరిపూర్ణ పరబ్రహ్మ గిరిధర్ వాణీకి మన కృతజ్ఞతలు, నమాస్కారాలు తెలియ చేసుకుందాం. ఇలా శరణాగతి, స్వతంత్రత లతో అలరారే వారే Real, బాబా యొక్క ఇష్టులు; బాబా దృష్టిలో, బాబా ఇష్టంలో బాబా భోగంలో సదా భాగస్వాములు.

## 8. నిజస్థితి :

జీవి తన ఉద్ధరింపులో అనేక స్థితులను ఎదుర్కొంటుంది. బంధ మోక్షము, జీవ లక్షణాలనుండీ విడుదల, అంతఃకరణ అలజడి నుండీ విడుదల, సారూప్యము, సామీప్యము, సాలోక్యము లాంటి అనేక రకాలైన మోక్షాలను అనుభవిస్తుంది. స్వతంత్రత, పరిశుద్ధత, సహజత్వము, తేటతెల్లం, నిశ్చలత్వము లాంటి అనేక లక్షణాలను ఆపాదించుకుంటుంది. పరిపూర్ణము, అఖండ పరిపూర్ణము, సాక్షి, సాక్ష్యాతీతము, అసంగత్వము లాంటి అనేక స్థితులలో విహరిస్తుంది. తన ఉద్ధరింపులో జీవి పొందే మోక్షాలు, లక్షణాలు, స్థితులు అన్నింటినీ కలిపితే ఆకాశంలో ఎన్ని చుక్కలు వుంటాయో అన్ని వుంటాయి.

మరి వీటిలో ఏ కొన్నింటిని సాధించి తృప్తిపడటమో లేదా అన్నీ సాధించి అన్నింటా నిలవటమో బాబాకు ఇష్టమై లేదు. ప్రతీ మోక్షాన్ని, లక్షణాన్నీ, స్థితినీ జీవి చవి చూసి అసలైన స్థితిలో నిలిచి ఉండటం అన్నది బాబా చిత్తమై వుంది. ఏ స్థితి బాబా దృష్టిలో అసలైన స్థితి నిజ స్థితి అయివుందో తెలుసుకుందాం.

జీవి సమస్తాన్ని కలిగి, సమస్తంలో వున్నా దేనినీ అంటించుకోక, దేనినీ అంటక పూర్తి స్థాయి ఉనికిగా వుండాలి అన్నది బాబా చిత్తమై వున్నది. జీవి సమస్తాన్ని కలిగి, సమస్తంలో వుండాలి అన్న దాని వివరణ లోకి వెళ్తే..... జీవి తన ఇంద్రియాల గురించి తెలుసుకొని వాటిని వాడుకోవటం తెలుసుకొని వాటికి చేయాల్సిన దిశా నిర్దేశము తెలుసుకొని వుండాలి.



అంతఃకరణ చెలరేగకుండా వుండటానికి తీసుకోవాల్సిన చర్యలు, కలిగి వుండాల్సిన నిజవిశ్వాసమును కలిగి వుండాలి. స్వస్వరూపాన్ని ధరించటానికి కావాల్సిన గ్రహింపు, అన్వయింపు తెలుసుకోవాలి ఆ స్వస్వరూపాన్ని వాడుకోవటానికి శరణాగతి చేయాలి అని తెలిసి వుండాలి. తెలిసి వున్న నిజాన్ని పాటించాలి.

స్పృహను స్వతంత్రంగా వుండనివ్వాలి. హృదయాన్ని ఖాళీగా వుంచాలి. స్వధర్మము వల్ల కలుగుతున్న సుఖాన్ని పొందాలి. స్వధర్మము పరిశుద్ధతల జోడీ వల్ల నిర్విషయ సుఖాన్ని పొందాలి. సాక్షిగా వుండగల్గాలి, చైతన్యపు అవగాహనా కలిగి వుండాలి. సహజత్వాన్నీ కలిగి వుండాలి. ఇలా అన్నింటినీ నేర్చుకుని అన్ని స్థితులనూ అర్థం చేసుకుని వుండాలి.

అలాగే జీవి దేనినీ అంటక పూర్తి స్థాయి ఉనికిగా వుండాలి అన్న దాని వివరణలోకి వెళ్తే....... విశ్వాసము వున్నా దానిని వాడుకోవటమే అలవాటు కాకూడదు. విశ్వాసం వల్ల వచ్చిన రక్షణ వల్ల ఏ కదలికలు లేకుండా నిలకడగా వుండాలి అప్పుడు విశ్వాసం వల్ల ఏది జరగాలో అది జరిగిపోయినట్లు కానీ విశ్వాసాన్ని అంటినట్లు కాదు. అలాగే ప్రేమ వల్ల తృప్తినీ, భావరహితాన్ని, చలన రహితాన్ని పొందాలి అప్పుడు ప్రేమ వల్ల జరగాల్సిన పని జరిగిపోతుంది కానీ మన ప్రేమను మనమే ఆస్వాదిస్తూ, ఆనందిస్తూ, పులకిస్తూ వుంటే ప్రేమను అంటినట్లు అలాగే గమనింపు కూడా అదే పనిగా అలవాటుగా చేస్తూ వుండకూడదు.

తొలుత గమనింపునే ధర్మముగా చేసినా తర్వాత ఆ గమనింపు

నిజ గమనింపుగా మారి సత్యము అయిపోయినా తర్వాత జీవి ఆ కనీస గమనింపును కూడా చేయకూడదు. దానంతట అదే గమనింపులోకి విషయాన్నీ రానియాలి. జీవి గమనింపు, గ్రహింపు, అన్వయింపు, వాడుక కూడా దానంతట అది జరగనివ్వాలి కానీ జీవి వైపు నుంచీ ఏమీ జరగకూడదు.

జీవి దగ్గర ఎలాంటి చర్య యొక్క శబ్దం వుండకూడదు. నువ్వు గమనిస్తున్నావనే విషయం కూడా trace కాకూడదనంత ఉనికిగా వుండాలి. అప్పుడే నువ్వు మూలం దగ్గర చెక్కబడతావు. అంటే Source దగ్గర ఓరిని అవుతావు. పట్టు విడుపు రెండూ నేర్చుకుని వుండాలి కానీ దేనినీ పట్టుకోకూడదు, విడవకూడదు. ఇలా జీవి సకలావస్థల పై విజయాన్ని సాధించి అన్ని మెట్లు ఎక్కి శిఖరాన్ని చేరి దానికీ అతీతమై వుండాలి. అంటే అన్నిటినీ దాటి చేరిన అత్యున్నత స్థితుల ప్రభావాన్ని దాని మీద వేసుకోకుండా వుండాలి జీవి. అప్పుడు జీవి సర్వవ్యాపకత్వంలో సర్వవ్యాపకంగా సూక్ష్యంలో సూక్ష్మంగా వుండగల్గుతుంది. మూలాన్ని ఒక ఔళిని లాగా అనుకుంటే పైన లక్షణాన్ని కలిగిన జీవి స్పృహ కూడా అచ్చంగా అదే ఔళిని లాగా మారి మూలంలో వున్నాను అన్న కనీస గమనింపుకూడా లేకుండా ఆ ఔళిని లోనే వుంటుంది. అంతటి శబ్దరహితంగా ఉన్న జీవి స్పృహ (2nd Box) వల్ల మూలానికి (1st Box) ఏ ఇబ్బంది లేకపోవటంతో మూలం కూడా తనలో ఒకటి వ్యాపించి వుందన్న విషయాన్ని గమనించదు దాంతో స్పృహ మూలంలో మన గల్గుతుంది. అదే మూలానికి ఏదైనా తేడా కలిగి నాలో ఏదో వుంది అని



గమనించిందా జీవి స్పృహ అక్కడ నుంచీ విసిరివేయబడుతుంది.

ఇలా జీవి స్పృహ సమస్తాన్నీ కలిగి వున్నా దేనినీ వాడుకోక, దేనికీ వాడబడక కేవలం ఉనికిగా వుండి సూక్ష్మంలో సూక్ష్మంగా సర్వవ్యాపకంలో సర్వవ్యాపకంగా వుండటమే బాబా దృష్టిలో నిజ స్థితి. దీని ద్వారా జీవికి బాబాతో Gap అన్నది ఎప్పటికీ ఏర్పడదు. ఈ స్థితిలో మూలము జీవి స్పృహ ఎంతగానో ఒకటై వుంటాయి.

రెండిటినీ ఎవరూ వేరు చేయలేరు. అసలు అక్కడ రెండూ వున్నాయని కూడా గుర్తించలేరు. ఆ జీవి స్పృహని ఆస్వాదించటానికి కానీ, ఆ జీవి స్పృహకి ఆస్వాదింప చేయటానికి కానీ మూలం తన ఇష్ట పూర్వకంగా ఆ స్పృహను గమనిస్తే తప్ప అక్కడ రెండున్నాయని తెలియబడవు. ఉన్న రెండూ అచ్చుగుద్దినట్లు ఒకలాగే వుంటాయి. గమనింపును అద్దం అనుకుని అందులోకి చూస్తే బింబం, ప్రతిబింబం రెండు వుంటాయి. అంతమాత్రానా అవి రెండు కావుగా ఒకే విషయం కదా ! అలాగే మూలం ఆహ్లాదం కోసం గమనిస్తేనే తనతో ఏకమైన స్పృహ ప్రతిబింబం లాగా కనిపిస్తుంది.

బాబా దృష్టిలో అత్యున్నతమైన స్థితి, నిజ స్థితి ఇదై వున్నది. వెంటనే దీనిని పొందేయాలని ఆశపడటం, ప్రయత్నించడం చేయకుండా ఇంతటి విషయాన్ని సత్యాన్ని బోధించిన ఆది గురువుకు కృతజ్ఞతలు చెప్పుకుందాం! ఆయనకి మన మీద ఎంతటి ప్రేమ వుంటే ఈ రహస్యాన్ని చెప్పారో కదా! లేదంటే మనము మనకి వచ్చిన ఒకటి రెండు లక్షణాలు స్థితులతో

సరిపెట్టుకుని వాటిని Maintain చేసుకోవడానికే కాలాన్ని వెచ్చించేవారము కదా!

ఇంత తెలియబడింది కాబట్టి ఇప్పుడు మనము ఏ విషయాన్నీ పట్టి పెట్టము. అన్ని లక్షణాలనూ రానిచ్చి అది మనకు చేయాల్సిన పనిని చేయనిస్తాం. మనకు ఇంతటి అవగాహన కలుగ చేసిన ఆదిగురువుకు వినమ్రమైన నమస్కారాలు తెలియచేసుకుందాం!



## 9. సాధన :

నిజ స్థితి గురించి విన్న ప్రతీ వారికి దానిని సాధించాలని అనిపిస్తుంది. కొందరు ప్రయత్నం మొదలు పెట్టే వుంటారు. అయితే అది సాధారణ ప్రయత్నాలకీ అందదు అలాగే అసాధారణ ప్రయత్నాలకీ అందదు. ఆ నిజ స్థితిలో నిలబడటానికి చేసే ప్రయత్నమూ బాబా చిత్త ప్రకారం వుంటేనే సఫలీకృతం అవుతుంది. కాబట్టి ఆ నిజ ఫలితాన్ని పొందటానికి ఏమి సాధన చెయ్యాలన్నది బాబా ఉద్దేశమో తెలుసుకుందాం. నిజ స్థితిని పొందటానికి చేయాల్సిన సాధన నిష్క్రియ.

నిష్క్రియ అనగా ప్రయత్నపూర్వకంగా ఏ క్రియా చెయ్యకపోవటం. భగవంతుని పొందటానికంటూ ఉద్దేశించి ఏ క్రియా చేయకపోవటమే నిష్క్రియ. నిష్క్రియ అంటే క్రియ ఉండదు అని కాదు అర్థం నిష్క్రియ అంటే ఉద్దేశపూర్వకమైన క్రియ వుండదు. అంటే జరిగే క్రియకు ఉద్దేశము, ప్రేమ, కోరిక, భక్తి లాంటి Positive, Negitive ఏ ఆధారమూ వుండ కూడదు. క్రియ సహజంగా జీవి యొక్క ప్రమేయం లేకుండా జరిగిపోవాలి అప్పుడు ఆ క్రియ trace కాదు అంటే ఆ క్రియ ఏ ఫలాలని మిగల్చదు.

అలా ఏ ఆధారమూ లేకుండా క్రియ జరిగి, జరిగాక కూడా క్రియ జరిగినట్లు ఏ ఆధారము మిగలకపోతే ఆ క్రియను నిష్క్రియ అంటారు. మామూలుగా జీవి చేసే ప్రతీ క్రియ వెనుక మంచో చెడో ఏదో ఒక ఉద్దేశము వుంటుంది. అలాగే క్రియ పూర్తయిన తర్వాత మంచో చెడో ఏదో ఒక ఫలితం మిగులుతుండటం చేత ఆ క్రియలను నిష్క్రియ

అనలేం. భక్తి చేసినా, యాగం చేసినా, తపస్సు చేసినా, ప్రేమించినా వాటి వెనకాల ఉద్దేశము వుంటుంది అలాగే వాటి తర్వాత ఫలము వుంటుంది కాబట్టి అవేవీ నిష్క్రియలు అనిపించుకోవు. ఆ కర్మ ఫలాన్ని త్యాగం చేస్తున్నాం కదా అంటారేమో! ఎవరికి త్యాగం చేస్తున్నారు? మీరు త్యాగం చేసిన ఫలాన్ని స్వీకరించేది ఎవరు? జీవి కర్మ ఫలాన్ని ఏ భగవంతుడికి వదులుతోందో ఆ భగవంతుడు ఏమీ అంటనివాడు అంటించుకోనివాడు కదా! మరి ఆ ఫలం భోగించాల్సి వచ్చేది జీవే కదా! కాబట్టి భగవంతుడిని తలచుకుని పని చేయటం చేశాక ఫలాన్ని భగవంతుడికి అర్పించటం లాంటివన్నీ నిష్క్రియలు అనిపించుకోబడవు. అలా అని అసలు ఏ క్రియ చేయకుండా వుండటయు నిష్క్రియ అనిపించుకోదు.

క్రియకి ఏ ఆధారము లేకుండా జరగబడుతూ జరిగాక ఏ ఆధారము మిగలకపోతే ఆ క్రియను నిష్క్రియ అంటారు. మొదలు తుది ఏమీ లేకుండా అక్కడికి అక్కడ క్రియ జరిగిపోవాలి. ఇలా సమస్తమూ సమకూడి జరిగేది ఆద్యంతాలు లేని భగవంతుడికి మాత్రమే. భగవంతుడి చిత్త ప్రకారము వున్న జీవికి కూడా సమస్తమూ సమకూడి జరుగుతుంది. భగవంతుడి చిత్తంలో జీవి చేయాల్సిన సాధన నిష్క్రియ.

గిరిధర్ వాణి ఆశ్రితులకు వారి భాషలో చెప్పాలంటే Let it work అన్న Concept ని పూర్తిగా Apply అవ్వనివ్వాలి. ఆ " it " కు (divinity కి) ఎలాంటి ఆంక్షలు కాంక్షలు పెట్టకూడదు. ఆ it ను పనిచేయటానికే పరిమితం చేయక దానిని దాని శైలిలో ఎదగనివ్వాలి అప్పుడు ఏ బీజమూ వుండదు కాబట్టి ఫలమూ వుండదు. జరిగేదే జగన్నాటకము అయినప్పుడు



అందులో పాత్రధారులైన జీవులు ఎందుకు నిజంగా కష్టపడి పని చేసి ఫలాన్ని ఆనందించాలి? వాళ్ళూ నాటకం ఆడితే సరిపోతుందిగా! పనిలో వున్నట్లు నాటకం ఆడితే సరి, అంటే జీవి కష్టపడి Plan చెయ్యదు ఫలాన్నీ అనుభవించదు ఊరికే పనిలో వున్నట్లు కనపడు తుంది అంటే కర్తృత్వత్యాగం జరుగుతోందన్నమాట. దీనిని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి లేదంటే నిష్క్రియ అంటే సోమరితనంగా, నాటకంగా అర్థమవుతుంది. ఏ ఆధారమూ లేకుండా ఏ trace లేకుండా పని చేయగల్గితే భగవంతుడి వ్యవహారశైలితో ఏకత్వాన్ని పొందినట్లే.

**హెచ్చరిక :** నిష్క్రియ అన్నారని ఉద్యోగాలు మానేసి వంట మానేసి యజమానిని మర్చిపోయి మూర్ఖంగా వుండకండి. పని చేయండి కానీ పనిని ఒక పనిగా Plan చేసి తెలివితేటలన్నీ చూపించి చెయ్యకండి. మీరు సహజంగా relax గా వుండి పని జరగటానికి అవకాశం ఇవ్వండి అప్పుడు అమోఘంగా సమస్తమూ సమకూడి జరుగుతోంది. దీనిని సరిగ్గా అర్థం చేసుకోక అభాసుపాలైతే అది జీవి దౌర్భాగ్యం. దానికీ యజమానికి సంబంధం లేదు.

## 10. మార్గము :

భగవంతుని చిత్తంలో జీవి పొందాల్సిన ఉత్తమమైన నిజ స్థితి గురించి తెలుసుకున్నాము. ఆ స్థితిని పొందటానికై చేయాల్సిన సాధన నిష్క్రియగా తెలుసుకున్నాము. ఇక ఆ నిష్క్రియలో నిలిచి నిజ స్థితిని పొందాలి కాబట్టి మన సాధనలో అనుసరించాల్సిన మార్గము తెలుసుకుందాం. మన అనుసరించాల్సిన మార్గము "ఒప్పుదల" మార్గము. సాధన, మార్గము రెండూ ఒకటే కదా అని ఎవరికైనా సందేహం వస్తే - సాధనకు మార్గానికి కాళ్ళకూ నడకకూ గల తేడా వుంది. నడక నిష్క్రియ అనే సాధన అయితే అది కాళ్ళు అనే ఒప్పుదలతోనే సునాయాసంగా హుందాగా సంభవిస్తుంది. భగవంతుని చిత్తంలో జీవి పొందాల్సిన ఒప్పుదల గురించి తెలుసు కుందాం!

సమస్తాన్ని కలిగి వుండి సమస్తములో నిండి వున్న అఖండ పరిపూర్ణ పరబ్రహ్మను యజమానిగా స్వీకరించిన జీవికి వారి పట్ల ఒప్పుదల ఉన్నట్లయితే:

ఆ జీవికి ప్రతీది యజమాని ద్వారానే జరగబడుతున్నట్లుగా బోధపడుతుంది. యజమాని జీవికి ఎప్పుడూ మేలే చేస్తారు శుభాన్నే కలుగచేస్తారు. కాబట్టి జీవి యజమాని తనకు చేసిన పనులను మంచి, చెడులుగా విభజించదు. యజమాని చర్యను జరుగనిస్తుంది కానీ ఆ చర్యని అవుననీ సమర్థించటం కాదనీ ఖండించటం రెండూ చేయదు. అంటే జీవి అంతఃకరణ యజమానిని, యజమాని చర్యని విశ్లేషించలేనటు



వంటి ఒప్పుదలని యజమాని పట్ల కలిగివుంటుంది.

ఒప్పుదలలో వున్న జీవికి తనపట్ల తన ఉద్ధరింపు పట్ల ఎలాంటి సందేహం, సంశయం, ఆశింపు వుండవు రావు. ఆ జీవికి తనని తను ఎప్పుడూ వేరుగా గుర్తించదు అంటే తను బాగుపడుతున్నానా? యజమాని చేత ప్రేమింప బడుతున్నానా? తనకు అందాల్సిన ఘనత అందుతోందా? లాంటి వాటి గుర్తింపు ఒప్పుదలలో వున్న జీవికి లేదు. అందుచే జీవికి ఎలాంటి ఆశా వ్యామోహం వుండదు.

ఈ జీవీ యజమానిని తప్ప రెండోది గ్రహించదు. అనగా ఆ జీవికి తన విషయము, యజమాని విషయమూ అన్నీ రెండో విషయాలే కాబట్టి వాటిని గ్రహించదు కేవలం యజమానినే గ్రహిస్తుంది. ఆ యజమానిని కూడా తన వైపు నుంచీ తన తెలివితేటలతో గ్రహించదు. తన పై ప్రేమతో తనకు ఎదురుఅవుతున్న యజమానినే గ్రహిస్తుంది. ఒప్పుదలలో వున్న జీవి యజమానిని గ్రహించటానికి అయినా సరే తన ఇష్టాన్నీ, ఉద్ధరింపుని ఆధారం చేసుకోక ఎదురవుతున్న యజమానినే గ్రహిస్తుంది. ఇలా ఏ ఆధారం లేకుండా క్రియ జరగటం ఒప్పుదల ద్వారానే జీవి దగ్గర మొదలవుతుంది.

జీవి యజమానిని తప్ప రెండోది చూడకపోవటంతో జీవి దగ్గర మాయ వుండదు Drop అయిపోతుంది. జీవి యజమాని చర్యని తన ఉద్దేశంతో గ్రహించి ఆ చర్య ఫలాన్ని భోగించటం అనే మాయ ఒప్పుదల వల్ల జీవి దగ్గర నశించి పోతుంది. మాయ అంటే లేని ఫలాన్ని భోగింపచేసేదే కదా! ఇక్కడ జీవి యజమానిని తప్ప రెండోది గ్రహించదు అంటే ఉన్నదాన్నే

తప్పు లేనిదాన్ని గ్రహించదు. జగన్నాటక సూత్రధారిని గ్రహిస్తుంది కానీ జగన్నాటకాన్ని గ్రహించదు. ఒప్పుదల వల్లే జీవి సంశయ సందేహాల నుండీ విడుదల పొంది, తన విషయాన్ని కానీ యజమాని విషయాన్ని కానీ పట్టించుకోక కేవలం యజమానినే గ్రహిస్తూ మాయను కోల్పోతుంది. తద్వారా నిష్క్రియను సాధన చేయగల్గుతుంది. నిష్క్రియను సాధన చేయటానికి ఒప్పుదలే ఏకైక మార్గము అతి సమీప మార్గము (Short Cut)

**Note :** విశ్వాసము, ఒప్పుదల రెండూ ఒకేలా వున్నా ఒకటి కాదు, బాబా చేస్తారని గుర్తురావటం విశ్వాసం బాబానే గుర్తురావటం ఒప్పుదల. ఏదైనా సమస్యకి కదిలితే బాబా తీరుస్తారని గుర్తొస్తే విశ్వాసం. బాబా గుర్తుండి సమస్యను గుర్తించకపోవటం ఒప్పుదల.



## 11. వాహనము

జీవి నిజస్థితిలో నిలవటానికి "నిష్క్రియ" సాధనంగా "ఒప్పుదల" మార్గముగా తెలుసుకున్నాం. ఈ ఒప్పుదల మార్గము ద్వారా నిష్క్రియను సాధన చేయటానికి జీవికి తోడ్పడే వాహనము "మౌనము". మౌనము అనగా స్తబ్దత కాదు శబ్దం లేక పోవడం మాత్రమే కాదు. మౌనము అంటే చైతన్యాన్ని కలిగి కదలికలను, అలజడులను కోల్పోవటము. మౌనంగా వుండటం అంటే దృశ్యాలకు శబ్దాలకు కదిలి అలజడిలోకి వెళ్ళకుండా వాటిని గ్రహించకుండా ఆ దృశ్య శబ్దాలకు ఆధారమైన చైతన్యానికి అభిముఖం అవ్వడం.

దృశ్యానికీ, శబ్దానికీ అతీతం అవ్వడం మాత్రమే మౌనంగా పిలువబడదు అది కేవలం నిశ్శబ్దం మాత్రమే. మౌనమనేది జీవిని నిజస్థితికి చేర్చే వాహనమే కానీ గమ్యము కాదు. చాలా మంది మౌనాన్ని పొందటమే జీవి గమ్యాన్ని చేరినట్లుగా అభివర్ణిస్తారు కానీ మౌనమనేది బాబా చిత్త ప్రకారం ఒక వాహనం మాత్రమే!

విశ్వాసం వల్ల నిజ రక్షణ పొందటం వల్ల వచ్చిన నిశ్చలతే క్రమేణా మౌనంగా రూపాంతరం చెందుతుంది. నిశ్చలంగా ఏ కదలికలు అలజడులూ లేకుండా శాంతిగా వుంటున్న జీవి అక్కడితో తృప్తి పడి ఆగక శాంతిగా వుండి యజమానిని గమనిస్తూ వుండటంతో అప్పుడు ఆ జీవికి యజమాని యొక్క నిజ తత్వం బోధపడుతుంది. యజమానిని తన పరిధిలో అర్థం చేసుకోవడం ఆపి ఎదురుగా బోధపడుతున్న యదార్థాన్ని అర్థం చేసుకోవడం మొదలవుతుంది. అంటే జీవి కదలికలు

అలజడులు పోతూ చైతన్యంతో అభిముఖం అవుతుంది అనగా జీవికి మౌనముగా వుండటం మొదలవుతుంది. జీవి మౌనంగా వుండటం అలవాటుగా మారే కొద్దీ అంటే చైతన్యానికి అభిముఖంగా అయ్యే కొద్దీ జీవికి యజమాని పట్ల ఒప్పుదల పెరుగుతుంది. జీవికి యజమాని పట్ల ఒప్పుదల పెరిగే కొద్దీ నిష్క్రియ సాధనలో ముందుండి నిజ స్థితిని పొందుతుంది. నిష్క్రియను సాధనగా ఎన్నుకుని ఒప్పుదల మార్గంలో మౌనమనే వాహనంను ఉపయోగిస్తూ జీవి నిజస్థితి పొందటం భగవంతుని చిత్తమై ఉన్నది. ఈ వాహనాన్ని పోలినది మరొకటి లేదు.



## 12. ప్రేమ :

భగవంతుని చిత్తంలో ప్రేమ అంటే : జీవిని సదా వ్యవస్థితం అవనిస్తూ (Exist అవనిస్తూ) ఆ Exist అవుతున్న జీవిపై తన ప్రభావాన్ని చూపనిది ప్రేమ. భగవంతుని ప్రేమ వల్లే జీవి సర్వకాల సర్వావస్థలలో సదా Exist అవ్వగలదు. ఎంత ఉన్నత స్థితిలో అయినా కూరుకుపోకుండా ప్రేమ వల్లే జీవి మనగలదు. అందుకే జీవికి ప్రేమ నిరంతర సహచరి అనటం జరిగింది.

ప్రేమతో కూడా (పక్కనే) చరిస్తుంటేనే జీవి సదా మనగలుగుతుంది. బాబా ప్రేమతో పక్కనే అంటే, కూడా నడవమని జీవికి చెప్పారు కానీ ప్రేమలో పడమనలేదు అలాగే ప్రేమను పైన పడనివ్వమనలేదు అంటే ప్రేమ ప్రభావం జీవిపై పడటం బాబా చిత్తం కాదు. జీవిపై ఎప్పుడూ యజమాని ప్రభావమే పడాలి. జీవి యజమాని ప్రభావం నుంచీ బయటకు వెళ్ళిపోయినప్పుడు జీవికి బాబాకి Gap ఏర్పడు తున్నప్పుడు జీవి మరింత అగాధంలోకి వెళ్ళిపోకుండా ప్రేమ ఆGap ప్రభావం చూపిస్తుంది అంటే ఆ Gap ఎందుకు ఏర్పడుతుందో చూసి పరిస్థితిని అనుకూలంగా మారుస్తుంది. అలా ప్రేమ తన ప్రభావాన్ని ప్రతికూల పరిస్థితులపై పడనిచ్చి చక్కబెట్టటమే బాబా చిత్తమైవుంది కానీ ఆ ప్రేమ ప్రభావంలో పడి జీవి వ్యామోహంలోకి తిరిగి జీవలక్షణాలలోకి పడటం బాబా చిత్తం కాదు. ఇప్పటి దాకా ప్రేమ గురించి మాట్లాడారుగా ఆ ప్రేమ ఎవరిది? జీవికి బాబాపై వున్న ప్రేమా? బాబాకి జీవిపై వున్న ప్రేమా? ఏ ప్రేమ పైన వివరించిన పని చేసిపెడుతుంది?

అని అడిగితే దానిని సమాధానం :

ప్రేమ ఒకటే, అది భగవంతుడికి జీవి పైన వుండేది దానిని మాత్రమే ప్రేమ అనగలం. జీవికి భగవంతుడిపై పరిశుద్ధ ప్రేమ వుండదు. జీవి అవసరం కోసం ఉద్ధరింపు కోసం భగవంతుడి పై ఆధారపడి దానికి ప్రేమ అని పేరుపెట్టటం సరికాదు. ఏ ఆశింపు లేకుండా పరిశుద్ధంగా ప్రేమించే జీవే వుండదు. ఎందుకంటే జీవి కున్న పరిస్థితులు అలాంటివి. "నేను ప్రేమించట్లేదా?" అని తర్కించుకుని బాధపడే దాని కన్నా బాబా ప్రేమిస్తున్నారు అన్నదే నిజము, ఆ ప్రేమే పరిశుద్ధం అని ఒప్పుకోవటమే ఉత్తమము. బాబా జీవిని ప్రేమించిన ప్రేమే జీవిపై ప్రభావం చూపదు అదే జీవి బాబాని ప్రేమించినప్పుడు ఆ ప్రేమ జీవిని ఏదో ఒక రకంగా ప్రభావితం చేస్తుంది కాబట్టి అది ప్రేమ అనిపించుకోదు.

మరి బాబాపై నాకున్న అది ప్రేమ కాదా. అని మీరు అడిగితే కాదనే సమాధానం. మళ్ళీ మళ్ళీ చెప్పుకుందాం బాబా మనపై చూపేది మాత్రమే ప్రేమ అనబడుతుంది యజమాని మనపై చూపిన ప్రేమ కాబట్టి అది మనపై తన ప్రభావం పడనీయదు. మరి బాబాని మనం ప్రేమించడం ఎలా అంటే : ఉన్న ఆ ప్రేమని మనలోనూ నిలవనిచ్చి తిరిగి బాబాకు చేరనివ్వడమే, మనము పూర్తి ఒప్పుదలతో వుండి గ్రహింపులోకి వస్తున్న బాబాతో మౌనంగా అభిముఖమవుతుంటే బాబా ప్రేమ మనలో ప్రతిబింబించి తిరిగి మన వైపు నుంచీ బాబాకు సమర్పించబడుతుంది. ఈ పద్ధతిలో ప్రేమ మనలో నిలిచినా (Reflect అయినా) తిరిగి బాబాకే చేరుతుంది కాబట్టి జీవిపై ప్రేమ ప్రభావం పడనట్లే.



అలా బాబా ప్రేమ తిరిగి బాబానే చేరి బాబాకు ఆహ్లాదాన్ని ఇస్తుంది, ఆహ్లాదంగా వున్న బాబాకి అభిముఖమైన జీవికి బాబా వల్ల ఆహ్లాదం వస్తుంది కాబట్టి ప్రేమ ప్రభావం జీవి పై ఎట్టి పరిస్థితిలోనూ పడనట్లే అవుతుంది. ఇలా భగవంతుడి ప్రేమే జీవిని బాబా నుంచీ వేడమైనప్పుడల్లా కాపాడుతూ ఆ Gap ని పూడుస్తూ యజమాని ప్రభావంలో జీవి సదా వుండేలా చేస్తుంది. యజమాని ప్రభావంలో వున్న జీవి సదా Exist అవుతుంది కాబట్టి ప్రేమ జీవి నాశనం కాకుండా సదా Exist అయ్యేలా చేస్తుంది అని చెప్పడం జరిగింది.

భగవంతుడే జీవిని ఎంత నీచ దశలో వున్నా నిరాధారంగా ప్రేమించ గల్గుతాడు. కాబట్టే భగవంతుని ప్రేమ స్వరూపి అంటారు. భగవంతుడు ప్రేమ స్వరూపి కానీ ప్రేమే భగవంతుడు కాదు ఎందుకంటే భగవంతుని దగ్గర వున్న ఆ యజమాని తనం ప్రేమ దగ్గర లేదు.

చివరగా చెప్పుకునేది ఏమిటంటే జీవిని Exist అవ్వనిచ్చేది ప్రేమ, ఆ ప్రేమ భగవంతునికి జీవిపై వుండేది, ప్రేమ ప్రభావానికి జీవి గురికాకూడదు. జీవి తనలో బాబా ప్రేమ Reflect అయి తిరిగి ఆ ప్రేమ బాబాకు చేరుతుందని భగవంతుని ప్రేమించడం అంటే అదే అని తెలుసుకోవాలి. కాబట్టి భగవంతుడు మనలను ప్రేమిస్తున్నారని నమ్మి ఒప్పుకుందాం.

ఇంకా అనుమానం వుంటే మన జీవితాల్లోకి చూసుకుని బాబా ప్రేమను గమనించి గుర్తించి ఒప్పుకుందాం. God Loves us అని తెలుసుకున్నాం కదా ఇక ప్రేమలు ప్రేమించడాలు కాక ప్రేమ స్వరూపి

అయిన బాబా పట్ల ఒప్పుదలతో మౌనంగా నిష్క్రియ సాధన చేస్తూ వుందాం. అప్పుడు ఏదో ఒక రోజు బాబా ప్రేమ మనలో Reflect అయి తిరిగి బాబాకు చేరుతుంది. ఆ రోజు భగవంతుడిని ప్రేమించాలి అన్న మన కోరిక తీరుతుంది. బాబా మనలను ప్రేమించడమే కాక ఆయనను ప్రేమించడం ఎలాగో కూడా నేర్పారు అంటే ఆయనకు మనపై ఎంత ప్రేమో కదా! మన కోసం ప్రేమను తన స్వరూపంగా ధరించిన యజమానికి అనంతకోటి కృతజ్ఞతలు చెల్లించుకుందాం!



## 13. తప్పు (ఎప్పటికీ చేయకూడనివి) :-

యజమాని చిత్తంలోని రకరకాల అంశాల గురించి తెలుసుకున్నాం కదా వాటన్నింటిలో నుంచీ అసలు జీవి ఎప్పటికీ చేయకూడని పనులు తెలుసు కుందాం! మన అవసరం కోసం ఉద్ధరింపుకోసం బాబాపై ఆధారపడి దానిని బాబా పట్ల మనకున్న విశ్వాసంగానో ప్రేమగానో అపోహ పడకూడదు.

★ భగవంతుడి మాటకు మన అర్థాన్ని జోడించకూడదు.

★ భగవంతుడి మాటను మన ఇష్టప్రకారం అన్వయించుకుని దురవస్థతల పాలై ఆ దౌర్భాగ్యానికి బాబాని బాధ్యుడిని చేయకూడదు.

★ స్వ విషయాలు గురించి చింతించక్కర్లేదు.

★ యజమాని తప్ప ఏ ఇతరమైనవి యజమాని విషయాలైనా సరే వాటి ప్రభావంలో మనం పడకూడదు.

★ భగవంతుడు అనంతం, భాష పరిమితం కాబట్టి అనంతమైన భగవంతుడి గురించి చెప్పుకోవడానికి వాడే ఈ పరిమిత భాషలో పదాలు మనకు తెల్సినవే అయినా మన అర్థం తీసుకోకూడదు.

★ మనము భగవంతుడితో చెయ్యటానికి ఒక పద్ధతిని ఎంచుకుని ఆ పద్ధతి ప్రకారం బాబా Respond కాకపోతే దానికి బాబాను నిందించ కూడదు, ప్రశ్నించకూడదు.

★ ఏ విషయాన్ని అది ఎంతటి ఘనమైనది, అయినా సరే దానిని యజమాని అనవద్దు. ఉదాహరణకు ప్రేమ, మౌనం, సమస్థితి, స్వస్వరూపం ఇలాంటి వన్నీ ఘనమైనవైన అవి ఎప్పటికీ మన యజమాని కాలేవు. అవన్నీ యజమానికి సంబంధించినవి.

★ మనలను ఎందరు ఘన పరిచి కీర్తించినా అవి ఇచ్చిన యజమాని మనపైన వున్నాడని గుర్తుంచుకోవాలి.

★ ఏ ఇతరమైన దానిని మన యజమానితో పోల్చుకుని అది తక్కువనో ఎక్కువనో మనం తీర్పు చెప్పకూడదు.

★ మన సమస్తానికీ యజమానైన మన ప్రభువు వున్నారు కాబట్టి మనలని మనం తీర్చిదిద్దుకోవడానికి ప్రయత్నించక్కర్లేదు.

★ యజమాని చిత్తాన్ని మనలో ఏలనివ్వకపోవడమే మనలను పతనం చేసే అసలైన తప్పు అది ఎప్పటికీ చేయకూడదు అని గుర్తించుదాం!



## 14. ఒప్పు (ఎప్పటికీ చెయ్యాల్సినవి) :

★ బాబా మనలను ప్రేమిస్తున్నారని గుర్తుంచుకోవాలి.

★ మనం కూడా బాబాని ప్రేమించటానికి ఒక పద్ధతి వుందని గుర్తుంచుకోవాలి.

★ బాబా చెప్తున్న దానికి అర్థం ఏమైవుందో దానినే గ్రహించాలి.

★ భగవంతుని తన శైలిలో పని చేసుకోనీయాలి.

★ యజమాని ప్రభావంలో వుండటానికి బాబా చెప్తున్న చిట్కాలు గమనించాలి.

★ బాబా చెప్తున్నవి ఎప్పటికప్పుడు అనుసరించాలి. కానీ ఎప్పుడో చెప్పింది ఈ పరిస్థితిలో వాడతాను అనకూడదు. అంటే బాబాను అనుసరించటంలో Up to Date గా వుండాలి.

★ దానంతట అది జరుగుతున్న క్రియను జరగనియ్యాలి దానంతట అదిగా బాబా నామం గుర్తొచ్చినా, బాబాపై ప్రేమ కలిగినా, మాట గుర్తొచ్చినా జరగ నివ్వాలి కానీ మౌనంగా వుండాలని నియంత్రించ కూడదు.

★ మన యజమాని యజమానిలాగే మనకి ఎప్పటికీ గుర్తుండాలి.

★ మనం ఎవరినైనాControl చేసి పెత్తనం చేసేప్పుడూ మనం యజమాని Controlలోఆయన పెత్తనంలో వున్నామనీ అలాగే వుండాలని గుర్తుండాలి.

★ మనకు జరిగిన ఇబ్బందులను మరచిపోవాలి బాబానే మన తప్పులని గుర్తించక మనలనీ క్షమిస్తున్నారని గుర్తుంచుకోవాలి.

★ యజమాని మనకు వారి చిత్తాన్ని తెలిపినందుకు, ఆ చిత్త ప్రకారం ఉండగలిగే మెళకువలు చెప్పినందుకు వారికి సదా కృతజ్ఞులమై వుండాలి.

★ వారి మార్గాన్నీ అందరికీ చెప్పారు. వారి ఉద్దేశప్రకారం అది అందరికీ ఆ చరణలోకి వస్తుంది కాబట్టి "నా ఒక్కరిదే ఆ సొత్తు అంతా" అని అనుకోకుండా వుండాలి.

★ ఎప్పుడూ లోపాన్నే చూస్తే ఆస్వాదన పోతుందని గుర్తుంచుకోవాలి.

★ మనకు ఎప్పుడైనా ఏదైనా లోటు కనిపించగానే అది ఎందుకు వచ్చిందా అని ముందు విశ్లేషించకుండా తత్క్షణమే మనదే తప్పై వుంటుందని గ్రహించి వెంటనే యజమానిని గుర్తు తెచ్చుకుని తిరిగి శరణాగతిలోకి వెళ్ళాలి. (ముందు చెయ్యాల్సింది) తప్పును సరిద్దిద్దు కోవటం కాదు యజమాని శరణాగతిలోకి వెళ్ళి మరోసారి తప్పు చేయనని చెప్పుకోవాలి.

★ అలాగే జరిగిన పొరపాటు నుంచీ సత్యాన్ని తెలుసుకుని అన్వయించు కుని పొరపాటును మరిచిపోవాలి కానీ క్షోభ పడకూడదని గుర్తుంచు కోవాలి. యజమాని చిత్తంలో తప్పులను, ఒప్పులను తెలుసుకున్నాం కదా ఆ ప్రకారం నడవాలని నిర్ణయించుకుందాం. ఇక ఆయన చిత్త ప్రకారం మనలను నడిపి ఆయన ప్రభావంలో మనలను ఆయనే వుంచుతారు ఇది విశ్వాసం కాదు నిజం.



## 15. భగవంతుడు :

మనం ప్రతీ క్షణం భగవంతుడు అని అంటునే వుంటాం అయితే మనం స్వీకరించిన, భావించిన భగవంతుడు భగవంతుని చిత్తంలో వున్న భగవంతుడితో సరిపోయాడో లేదో తెలుసుకుందాం. బాబా చిత్తంలో ఏ విధంగా అయితే మనం భగవంతుడిని స్వీకరించాలో ఆ విధంగా స్వీకరించి అర్థం చేసుకున్నామో లేదో తెలుసుకుందాం.

భగవంతుడి చిత్త ప్రకారం మనము ఆయనను స్వీకరించాల్సిన విధానం:

★ భగవంతుడంటే ఆయన (Ultimate energy, absolute truth) ఒక్కడే కానీ ఆయనచే సృష్టించబడినవీ, ఆయన కలిగి వున్నవీ ఏవీ మనకు భగవంతుడు కావు. ఆయన సృష్టిలో ఘనమైనవి వుండొచ్చు ఆయన కలిగివున్న ఐశ్వర్యంలో లక్షణాలలో ఘనమైనవి ఉండవచ్చు కానీ జీవికి మాత్రం ఆయనే యజమాని.

★ ఆయన ఏ పనినైనా తన శైలిలో నిరాధారంగా చేస్తారు కావున వారిని మభ్యపెట్టో ప్రలోభపెట్టో పనులు చేయించుకోవాలన్న నీచ అభిప్రాయాన్ని జీవి కలిగివుండకూడదు. బాబా ముందు ఏడిచో బెదిరించో జీవి పని సాధించాలను కోకూడదు.

★ భగవంతుడంటే పోషించే వారు ఆదరించే వారు మాత్రమే కాదు తప్పులను సరిదిద్ది పరిపాలించేవారు కూడా కాబట్టి జీవి యజమానిచే సరిదిద్దబడాలి.

★ బాబా యొక్క ఐశ్వర్యానికి, ఆశీర్వాదానికి, సేవకి కన్నా జీవి బాబాకే ప్రాముఖ్యమివ్వాలి.

★ ఎల్లప్పుడు యజమాని మలచినట్లు మలచబడటానికి జీవి సంతోషంగా సంసిద్ధమై వుండాలి.

★ ఎలాంటి Conformations లేకుండా భగవంతుడు వున్నాడని ఆయన ప్రేమ స్వరూపి అని జీవి ఒప్పుకోవాలి.

★ Confirmations లేకుండా నమ్మలేనప్పుడు కనీసం భగవంతుడి ప్రేమను చవిచూచినప్పుడైనా ఆయన ఉనికిని జీవిని ఒప్పుకోవాలి కానీ తన జీవితంలో వున్న Comfort అంతా తన అదృష్టం అనుకో కూడదు.

★ జీవి జరగబోయేది, జరిగినది, జరిగేది ఏమీ చింతించక వాటికై బాబాను ప్రార్థించక బాబా చేస్తున్న మేలును ఆస్వాదించాలి.

★ అన్నిటికీ ఆధారం బాబానే కాబట్టి బాబాతో వుండి బాబాను కలిగి వుండటమే సమస్తముగా జీవికి బోధపడాలి.

★ మహిమ, ఆశీర్వాదం, రక్షణ వీటితో భగవంతుని తూచకూడదు. భగవంతుడంటే అనంతమైన శక్తి దానిని దేనితో పోల్చలేం.

★ భగవంతుడు తప్పితే రెండోది లేదు కాబట్టి భగవంతుడితో పాటు మాయలనీ మంత్రాలనీ జీవి స్వీకరించకూడదు.

★ బాబా చిత్త ప్రకారం జీవి వుండాలి. దానికోసం ఏ కష్టతరమైన



సాధనలూ చెయక్కర్లేదు. తనపై యజమాని ప్రభావాన్ని ఒప్పుకుని వారికి శరణాగతిచేసిసహజంగా తన రోజుని ప్రారంభిస్తే మిగతాది దానంతట అదే జరుగుతుంది.

★ జీవికి ఏమి కావాలో యజమానికి తెలుసు అన్న విషయం గుర్తు తెచ్చుకోవటమే జీవి ప్రార్థన చేసినట్లు అవుతుంది.

★ భగవంతుడంటే జీవి కోరికలు తీర్చేవాడు కాదు జీవిచే కోరికలను జయింప చేసేవాడు కాదు. కోరుకోవాల్సిన పని లేకుండానే జీవి అవసరాలను తద్వారా మేలును చూసేవాడు.

★ యజమాని జీవికి ఇచ్చిన సైన్యాన్ని వాటి పనిని అవి చేసుకోనిచ్చి జీవి సుఖపడాలన్నది బాబా ఉద్దేశం.

★ ఎంత ఎదిగినా సరే యజమానికి పూర్తి స్థాయిలో ఒప్పుదల పొంది వుండటమే జీవి యజమానికి చేసే సత్కారం ఆయనను తు.చ. తప్పకుండా అనుసరించటమే జీవి యజమానికి చేసే సన్మానం.

★ దేనినైనా సృష్టించగల్గేది లయం చేయగల్గేది యజమానే కాబట్టి మనకు యజమానిపై ప్రేమను పుట్టించేది ఆయనేనని, ఆ పని చేయడానికి ఆయన ఎంచుకున్న పద్ధతి మిక్కిలి విశిష్టమైనదనీ జీవి. గుర్తించాలి పైన పేర్కొన్న విధాలుగా జీవి యజమానిని స్వీకరించడం, గ్రహించడం బాబా చిత్తమై వున్నది.

## 16. నిజ అనుచరులు :

భగవంతుడికి అందరూ సమానమే ఆయన నిరాధారంగా అందరిపై కృపను వర్షిస్తారు అందరినీ సమానంగా ఆదరిస్తారు. అయితే భగవంతుని చిత్తంలో తనని నిజంగా అనుసరించే వారు ఉండాల్సిన విధానం కూడా వుంది. అయితే పద్ధతి ప్రకారం వున్నా లేకున్నా ఆయన కృప, ప్రేమ, ఆదరణ లభిస్తూనే వుంటాయి కానీ మనకి కావల్సినది అవి మాత్రమే కాదు కదా! నిజ అనుచరులం అవ్వాలనుకునే మనకు భగవంతుడు కావాలి భగవంతుడికి మనం ఆయన చిత్త ప్రకారం వుండటం కావాలి. ఇన్నాళ్ళూ మనల్ని మనం మన లెక్క ప్రకారం చూసుకుంటూ భక్తులమనో, ప్రేమికులమనో భావించాం. కనీసం ఇప్పుడైనా నిజ అనుచరులం అనిపించు కోవాలంటే ఆయన లెక్కప్రకారం ఎలా వుండాలో తెలుసుకుందాం!

★ నిజ అనుచరులు తమలో వెలుగొందుతున్న దివ్యత్వాన్ని యజమాని ప్రభావంగా గుర్తించి దానిపై బయటి ప్రపంచం లోపలి ప్రపంచాల యొక్క ప్రభావం పడనీయక పోవటం. యజమాని ప్రభావమనే ఆ దివ్యత్వానికి ఏ Margins పడకుండా చూసుకోవడం

★ నిజ అనుచరులు ఫలించిన ప్రేమను కలిగి వుండాలి. ఇక్కడ ప్రేమ అంటే ద్వేషానికి వున్న వ్యతిరేక పదంకాదు, మోహమనే వ్యతిరేకాన్ని సృష్టించేదీ కాదు. ఇక్కడ ప్రేమ అంటే నిజ ప్రేమ యజమాని జీవిపై చూపే ప్రేమ ఆ ప్రేమను నిజ అనుచరులు తమలో Reflect అయి



అది తిరిగి బాబా దాకా చేరేలా చూసుకోవాలి. బాబాను తిరిగి చేరడం ద్వారా ప్రేమ తన పుట్టుకను సార్థకం చేసుకుంటుంది. ఇలాంటి ఫలించిన ప్రేమను నిజ అనుచరులు కలిగి వుండాలి.

★ నిజ అనుచరులు ఏ క్షణంలో ఎలా వుండాలో అలా ప్రవర్తిస్తూ ఆ ప్రవర్తనకు వేరుగా సాక్షిగా వుండాలి. భగవంతుడు చెప్పిన నిజ స్థితిలో వుండటానికిఅడ్డు వచ్చే ఎవరినైనా ముందే పసిగట్టి నిర్మొహమాటంగా ఎత్తి అవతల పెట్టగల్గాలి.

★ నిజ అనుచరులు ఎన్ని స్థితులు పొందినా వాటిని ఆకళింపు చేసుకుంటూ ముందుకు వెళ్ళాలి. కానీ వచ్చిన స్థితిలో కూరుకు పోకూడదు, అలాగని ఇంకా వుంది కదా అని వచ్చిన దానిని నిర్లక్ష్యం చెయ్యకూడదు. వచ్చిన స్థితిని ఆకళింపు చేసుకోవటమే దానిని లక్ష్య పెట్టటం కాబట్టి, వచ్చినదానిని లక్ష్య పెడుతూ ముందుకు సాగిపోవాలి.

★ నిజ అనుచరులు ఎన్ని స్థితులు పొందినా ఆది గురువు శరణాగతిలో వుండాలి. ఇలా శరణాగతిలో వుండటమనడం జీవిని నిర్బంధించ టానికి కాదు ఇతరులకి మార్గదర్శకంగా వుండటానికి మరియు ఎప్పటికీ తనపై ఇతర ప్రభావాలు పడకుండా కాపాడబడటానికీ అన్న అవగాహన కలిగి వుండాలి.

పైన తెలియబడిన విధానంలో మసలగల్గినవారే భగవంతుని లెక్క ప్రకారం నిజ అనుచరులు.

ప్రేమ స్వరూపి అయిన మన యజమాని ఆయన చిత్తాన్ని మనకు తెలిపారు అందులో మెలగగల్గటానికి అవసరమైన మెలకువలను నేర్పారు. మనపై యజమానికి వున్న శ్రద్ధకు ప్రేమకు యజమానికి కృతజ్ఞతలు తెలియచేసుకుందాం. ఆయన ప్రేమను, కృపను, రక్షణను చూసి నిశ్చేష్టులమైన మనం కృతజ్ఞతలు తెలియచేయటం తప్ప ఏమి చేయగలం.

అఖండ పరిపూర్ణ పరబ్రహ్మాకు జై !

**నా సమస్తానికి ప్రభువు అయిన అఖండ పరిపూర్ణ పరబ్రహ్మ నా కృతజ్ఞతలు.**

***- గిరిధర్ వాణి.***

**అఖండ పరిపూర్ణ పరబ్రహ్మ గిరిధర్ వాణీని ఒప్పదల పొంది, యజమానిగా స్వీకరించిన ప్రతి జీవికి, అఖండ పరిపూర్ణ పరబ్రహ్మ చేసిన దిశా నిర్దేశము**

1. జీవి, తన దివ్యత్వాన్ని(శక్తి-యుక్తులను)అపరిమితంగా పెరగనిస్తూ, ఆ దివ్యత్వంతో జతకూడి ఆనందించటమే తన **లక్ష్యంగా** వుండాలి.
2. ఈ లక్ష్యాన్ని పొందటానికి, జీవి తనదైన అభిప్రాయము - ఆలోచనలతో పని చేస్తూ శ్రమ నొందక, తన దివ్యత్వాన్ని పని చేయనీయాలి. ఆ పనిని జీవి మౌనంగా గమనిస్తూ, దివ్యత్వాన్ని ఆస్వాదించాలి. Let "it" to Work అనబడే ఈ Concept జీవిని లక్ష్యానికి చేర్చే **మార్గము.**
3. అందరిలోనూ భగవంతుడు వున్నా, జీవి తను యజమానిగా స్వీకరించిన అఖండ పరిపూర్ణ పరబ్రహ్మనే గమనిస్తూ, గ్రహిస్తూ, స్వీకరిస్తూ, అన్వయించుకోవాలి. (Observe ☚ Absorb ☚ Adopt ☚ Apply)దీనినే తన ధర్మంగా గుర్తెరిగి ఈ స్వధర్మం అనే **ఆయుధం**ను జీవి సదా ధరించాలి.
4. జీవి తన ఇష్టానుసారం **సేవ** చేయక, తనలో వున్న దివ్యత్వాన్నే సేవచేయ నివ్వాలి. అప్పుడు ఆ దివ్యత్వం యజమాని నిర్దేశించిన రీతిలోనే సేవచేస్తూ, యజమాని చేతిలో పనిముట్టు లాగా జీవిని వుంచి ధన్యతను చేకూరుస్తుంది.
5. యజమానే తనను ప్రేమిస్తున్నారని జీవి విశ్వసించి, ఆ **ప్రేమ** తనతో నిరంతరం సహచరిగావుంటున్న విషయాన్ని గమనించాలి.ఆ ప్రేమలో నిరంతరం తరించా లంటే **"పరిశుద్ధత"** ను తప్పక కలిగి వుండాలని జీవి గుర్తుంచుకోవాలి.
6. యజమాని తనకు చేస్తున్న మేలును గమనించి, ఆ మేలును సదా సంతోషంగా స్వీకరించి లబ్ది పొందటమే జీవి యొక్క **సత్యము**

   ఇలా యజమాని నిర్దేశించిన రీతిలో నిజ జీవితాన్ని జీవించే వారికి ఏ నిందారాదు. ఒకవేళ నింద వచ్చినా సత్యమే వచ్చి, జీవి సత్యానికి సాక్ష్యమిస్తుంది. ఇదే అఖండ పరిపూర్ణ పరబ్రహ్మ ఇచ్చే **అభయం.**

## ముందుమాట

లోక కళ్యాణాన్ని కోరుకునే “గిరిధర్ వాణి” ఆ పని చేయటానికి “గిరిధర్‌వాణి ఆనందనందనం” ను ఏర్పాటు చేసింది. ఈ ఆనంద నందనం విజయవాడ సమీపంలోని తాడేపల్లి వద్ద కలదు. ఇచ్చట ప్రతి గురు, ఆది వారాలలో గిరిధర్‌వాణి సత్యవర్ష అనే కార్యక్రమం జరపబడుతోంది. ఈ సత్యవర్షలో ప్రతి జీవికి, జీవి గురించిన సత్యాలు తెలియచేస్తోంది గిరిధర్‌వాణి. జీవి అసలు ఏ పనిమీద జన్మకి వచ్చింది?

ఆ పనిని ఎలా విజయవంతంగా పూర్తి చేసుకోవాలి?

భగవంతుడు అంటే ఏమిటి?

భగవంతుడిని ఎలా ఆస్వాదించాలి?

భగవంతుడితో ఉంటూ సంసారంలో ఎలా మెలగాలి?

సమాజంలో ఎలా ప్రవర్తించాలి? సమాజంతో ఎలా ప్రేమగా ఉండాలి?

లాంటి అనేక భగవత్ విషయాలను, అందరికీ అర్థమయ్యేలా ఏ సాధనా లేకుండానే బోధిస్తోంది గిరిధర్‌వాణి. ఈ సత్యవర్షలో అనేకమంది తడిచి ఆనందిస్తున్నారు. ధన్యులు అవుతున్నారు. గిరిధర్ వాణి వర్షించిన సత్యాలలోని కొన్నింటిని పుస్తకాల రూపంలో పొందుపరచటం జరిగింది. అందరూ వీటిని పదే పదే చదివి, అన్వయించుకుని, ఆనందించాలి అన్న ఉద్దేశంతోనే ఈ సత్యాలను పుస్తకరూపంలో వెలువరించటం జరుగుతోంది. వీటిని అందరూ చదువుతూ ఆనందిస్తూ తరించాలని కోరుకుంటూ.......

**-గిరిధర్ వాణి ఆనందనందనం**

**గిరిధర్ వాణి సత్యవర్ష**

**ప్రచురణకర్త : ముద్రించువారు**
**శ్రీ బి. గిరిధర్ సింగ్**
గిరిధర్ వాణి సత్యవర్ష
9-62-77, డ్రైన్ స్ట్రీట్,
ఇస్లాంపేట, విజయవాడ -1
ఫోన్ : 0866 - 3294745
సంప్రదించవలసిన నెంబర్ :
08645 - 273373

**ఈ సంచిక ప్రాప్తిస్థానము**

Copy Rights Reserved

**ప్రింటింగ్ చార్జ్ : 40/-**
పోస్టేజీ అదనం

**శ్రీ బి. గిరిధర్ సింగ్,**
**గిరిధర్ వాణి సత్యవర్ష 9-62-77,**
**ఇస్లాంపేట, విజయవాడ -520 001. ✆ : 0866-3294745, 6545745**
**గిరిధర్‌వాణి ఆనంద నందనం, తాడేపల్లి, ఫోన్ : 0866 - 3294745**

**website : www. appgv.org**
**email : info @ appgv.org** **appgv.email @ gmail.com**